లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

ప్రజలే ప్రభువులు

# జనబలం

నవంబర్ 2019 రూ.10/-



## గాంధీ తత్వం: 4వ విప్లవం

## దేశం గురించి తప్ప లోక్‌సత్తా గురించి దిగులక్కర్లేదు: జేపీ



# ఓట్లు, సీట్లు పొందిన పార్టీలకన్నా ఎక్కువగా రాజకీయ కృషి చేస్తున్న లోక్‌సత్తా

ప్రజలు ప్రభువుల్లా, పాలకులు సేవకుల్లా ఉండాల్సిందిపోయి.. పాలకులు ప్రభువుల్లా, ప్రజలు యాచకుల్లా తయారైన భారతదేశంలో నిజమైన ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్ఠించి ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనందించేందుకే లోక్‌సత్తాను డా॥ జయప్రకాష్ నారాయణ్ స్థాపించారని పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఓపక్క, దేశ వనరులను పందేరం చేస్తూ దోచుకుంటున్న, మరోపక్క, దేశ ప్రజల శక్తిసామర్థ్యాలను అణచివేస్తున్న సాంప్రదాయ రాజకీయాలను ఛేదించి భారత్‌ను ప్రపంచస్థాయికి ఎదిగేలా చేసే కొత్త రాజకీయం లోక్‌సత్తా అన్నారు. ఈ రాజకీయ ఉద్యమానికి కొనసాగింపుగానే లోక్‌సత్తా పార్టీని 2006లో గాంధీ జయంతి రోజున ప్రారంభించామన్నారు. లోక్‌సత్తా పార్టీ 13వ వార్షికోత్సవం సందర్భంగా విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాబ్జీ పాల్గొన్నారు. జాతీయ జెండాను, లోక్‌సత్తా పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం మాట్లాడుతూ.. గాంధీ, అంబేద్కర్‌లను కలపాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని లోక్‌సత్తా నెరవేరుస్తోందన్నారు. మనకున్న ఎన్నికల వ్యవస్థ, సామాజిక పరిస్థితుల వల్ల లోక్‌సత్తాకున్న ఆదరణను ఓట్లుగా మార్చుకోవడం కష్టంగా ఉందని, ఆలస్యంగానైనా లోక్‌సత్తా కొత్త రాజకీయం, విధానాలతోనే తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో సమూల మార్పులు సాధ్యమవుతాయన్నారు. లోక్‌సత్తా పార్టీ నేత రమణానందం మాట్లాడుతూ, పాలనలో జవాబుదారీతనం కోసం సుదీర్ఘకాలంగా వ్యక్తిగతంగానూ జేపీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఓట్లు, సీట్లు పొందిన అధికార, ప్రతిపక్ష పార్టీలన్నిటికన్నా ఎక్కువగా జనహితం దిశగా నిజమైన రాజకీయ కృషి చేస్తున్నది ఇప్పటికీ లోక్‌సత్తా, జేపీయేనని సగర్వంగా చెప్పుకోగలమన్నారు. సీనియర్ నేతలు సుధాకర్, రమణానందం మాస్టారు, బి.భాస్కర్‌లను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగభూషణం, రవితేజ, వర్రి విష్ణు, శిమ్మ శ్రీను, పీఎల్ఎన్ రాజు, రాజారావు, ఆదిరాజు, రఘు, ఎన్ని సత్యనారాయణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుట 22 సంచిక 11

నవంబర్ 2019



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


### జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 23 ఏళ్ల కిందటే చెప్పినా పట్టించుకోలేదు..

11 గాంధీ తత్వం- 4వ విప్లవం

22 కాలవాహినిలో పసిడికొండలు

23 సమాఖ్యతత్వం ప్రధానం



కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,

సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్




పేదరికం గురించి పీజీ వరకు చదివాను సార్...
ఇప్పుడు టీ అమ్ముకుంటున్నా...!

## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

05

జనబలం
అక్టోబర్ 2019

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

సంపాదకీయం

# మీడియాను రక్షించుకుందాం

మీడియాపై మరణ మృదంగం మ్రోగుతోంది. సాయుధ ఘర్షణలు, సామాజిక కల్లోలాలు జరిగే ప్రాంతాల్లో విధి నిర్వహణలో ఉన్న మీడియా సిబ్బంది ప్రాణాలు పోగొట్టుకోవడం సహజమే. అటువంటి ఘటనలను వృత్తిపరమైన విపత్తుగానే మీడియా భావిస్తుంది. కానీ, సాపేక్షంగా ప్రశాంత పరిస్థితులు నెలకొని వుండే ప్రజాస్వామ్య దేశాలలో సైతం మీడియాపై బహుముఖ దాడులు పెరుగుతున్నాయి. హత్యలు, అపహరణలు, దాడులు, ఆస్తుల విధ్వంసం, మహిళలయితే అత్యాచారాలు వంటివి నిత్యకృత్యంగా మారుతున్నాయి. వివిధ అంతర్జాతీయ సంస్థలు ఇటీవల వెలువరించిన నివేదికలలో మీడియాపై పెరుగుతున్న దాడులు, నిర్బంధాల పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రపంచంలోని అధ్వాన్న వృత్తుల జాబితాలో అగ్రభాగాన ఉన్న పదింటిలో పాత్రికేయం ఒకటి, పని పరిస్థితులు అధ్వాన్నంగా ఉండటంతో పాటు సరైన వేతన వ్యవస్థలు లేకపోవడం, వృత్తి విలువలు, ప్రమాణాలు దిగజారడం మీడియా విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రభుత్వేతరశక్తులు, మాఫియా ముఠాలు మీడియా స్వేచ్ఛపై సాగించే దాడులతో పాటు ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలు మీడియాను అదుపు చేయడానికి, నియంత్రిం చడానికి ప్రయత్నించడం కలవరం కల్గించే పరిణామం. ప్రజాస్వామ్యానికి ప్రాణాధారంగా ఉన్న మీడియా గొంతు నొక్కడానికి చట్టాన్నే ఉపయోగిస్తున్నాయి. సెన్సారింగ్ , నిఘా, ఆంక్షలు కొత్తరూపాల్లో వస్తున్నాయి. జమ్మూ, కశ్మీర్‌లో మూడు నెలల పాటు కమ్యూనికేషన్ వ్యవస్థలను బంద్ చేసిన విధానం ఒక తాజా ఉదాహరణ. మన దేశంలో కూడా మీడియాపై ఆంక్షలు, దాడులు, నిర్బంధాలు పెరుగుతూనే ఉన్నాయి. ఎమర్జెన్సీలో మీడియాపై నాటి ప్రభుత్వం ప్రయోగించిన నిర్బంధకాండ, అనంతరకాలంలో వేర్వేరు రూపాలలో కొనసాగుతూనే ఉన్నది. ప్రభుత్వాలు, అధినేతలు, అధికారులు అవకాశం ఉన్న ప్రతిసారీ మీడియాపై కొరడా విసురుతూనే ఉన్నారు. బీహారులో నాటి జగన్నాథ్ మిశ్రా తెచ్చిన బ్లాక్ బిల్లు నుంచి నేటి జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన 2430 జీవో వరకూ, ప్రయత్నం అంతా మీడియా గొంతు నొక్కడానికే! దీనిని ప్రతిఘటించడం జరుగుతోంది.

మీడియా సిబ్బంది భద్రతా స్థితిగతులు అధ్యయనం చేయడానికి ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా నియమించిన అమర్‌నాథ్ కమిటీ ఇచ్చిన నివేదికలో దేశంలో పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉన్నదీ వెలుగులోకి తెచ్చింది. శిక్ష పడుతుందన్న భయం లేకుండా ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తులు దాడులకు తెగబడుతున్నాయని నివేదిక వెల్లడించింది. గత పాతికేళ్లలో పాత్రికేయులపై జరిగిన దాడుల కేసుల్లో 75శాతం కేసులలో అభియోగ పత్రాలు సైతం దాఖలు కాలేదని, కేవలం 5శాతం కేసులలో మాత్రమే నిందితులకు శిక్షలుపడ్డాయని తెలిపింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు పెద్దపీట వేసిన మన రాజ్యాంగం ఎంతో ప్రగతిశీలంగా, ప్రజాస్వామ్యయుతంగా పత్రికా స్వేచ్ఛను గౌరవించింది. కానీ ఒక సమాజంగా మనం వాటిని గౌరవించలేకపోతున్నామని తేట తెల్లం అవుతూనే ఉంది. మీడియా స్వరూప, స్వభావాలలో వచ్చిన మార్పులు దాని గుణ, శీలాలను దిగజార్చాయి. విలువలు, ప్రమాణాలు ధ్వంసం అయ్యాయి. మీడియా విశ్వసనీయత ప్రశ్నార్థకం అయ్యింది.

దేశంలో లక్షా పదివేల పత్రికలు, 850 పైగా ఛానళ్లు, అందులో 400 వరకూ ఇరవై నాలుగు గంటల వార్తా ఛానళ్లు ఉన్నాయి. రేడియో టీవీ వంటి సంప్రదాయక మాధ్యమాలతో పాటు డిజిటల్ విప్లవం కొత్త కొత్త మాధ్యమాల వేదికలను మన ముందుకు తెచ్చింది. దేశంలో నూరుకోట్ల మంది చేతిలో మొబైల్ ఫోన్‌లు ఉంటే, అందులో 40కోట్ల మంది ఇంటర్నెట్ సదుపాయాన్ని వినియోగిస్తున్నారు. సమాచార వినోద పరిశ్రమలో పెట్టుబడులు దాదాపు రెండున్నర లక్షల కోట్ల స్థాయికి చేరగా, అందులో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వాటా గణనీయంగా పెరుగుతోంది. రానున్న ఐదేళ్లలో మీడియా పరిశ్రమ వృద్ధిరేటు 13శాతం, డిజిటల్ రంగం వృద్ధి రేటు 30శాతంగా ఉండబోతున్నది. ఆ మేరకు మాధ్యమాలలో కంటెంట్‌కు గిరాకీ పెరుగుతోంది. దాంతో అదో వాణిజ్య వస్తువుగా మారింది. అదే స్థాయిలో మార్కెట్ అవలక్షణాలను సంతరించుకుంటున్నది.

సమాచార ఆదాన, ప్రదానానికే కాక ప్రజాభిప్రాయాన్ని రూపు దిద్దడంలో మీడియాకు గల భూమికను, కార్పొరేటు రంగం తన అవసరాలకు అనుగుణంగా మార్చివేస్తున్నది. వ్యాపారానికీ, మీడియాకు మధ్యగల నియంత్రణా రేఖలు చెరిగిపోయాయి. మీడియాపై కార్పొరేటు గుత్తాధిపత్యం పెరిగిన మేరకు సంపాదక స్వేచ్ఛ కుదించుకుపోయింది. స్వేచ్ఛగా సాగాల్సిన భావ ప్రసారం మీడియా అధిపతులు, వారి రాజకీయ స్నేహితుల 'అవసరాల మూస'లోకి మారింది. భిన్నాభిప్రాయం లేదు. విమర్శ లేదు. భిన్నత్వం, వైవిధ్యం, బహుళత్వం అంతరించిపోతున్నాయి. బహిరంగ చర్చ కాస్తా 'ప్రచార యుద్ధకాండ'గా రూపు దాల్చింది. మీడియా సిబ్బంది ఈ ప్రచారం యుద్ధంలో సైనికుల మాదిరి తయారయ్యారు. వేతన వ్యవస్థలేని బుద్ధి జీవులు కాంట్రాక్టు కూలీల అవతారం ఎత్తారు. యాజమాన్యాల ఆలోచనలను అందంగా వ్యక్తీకరించే కిరాయి కార్యకలాపం సాగించడం ఆరంభించారు. ప్రజాభిప్రాయం, జనహితం గాలికి ఎగిరిపోయాయి. అన్ని వ్యవస్థలూ విఫలమైన చోట ప్రజాస్వామ్యాన్ని కాపాడే వ్యవస్థగా మీడియాకు గల పాత విశ్వాసం ప్రస్తుతం ఏ కోశానా కన్పించడం లేదు. ఆర్తిగా ఆశ్రయించాల్సిన ప్రజలు మీడియాను చూసి బెదిరిపోయే పరిస్థితి ఏర్పడింది.

ప్రజల కోసం, ప్రజాస్వామిక విలువల కోసం తపించే పాత్రికేయులు ఇంకా ఉండబట్టి ఆ మేరకు మీడియాకు గల విలువ ఇంకా కొనసాగుతున్నది. స్వేచ్ఛా ప్రియులైన పాత్రికేయులు ఏదో ఒక రూపంలో తమ భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రత్యామ్నాయ మీడియాను బతికించే కృషి సాగిస్తున్నారు. అటువంటి వారిపై రాజ్యాంగ వ్యవస్థలను చేతిలో పెట్టుకున్న ప్రభుత్వాలు, అధికారులు, నియంత్రణలు ఆంక్షలు ద్వారా దాడి చేస్తుంటే, ట్రోల్ ఆర్మీలు మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మాఫియా ముఠాలు, ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ పరిస్థితిని మార్చకపోతే పాత్రికేయం హతమైపోతుంది.

గుత్తాధిపత్యం, పక్షపాత ప్రచారం, వాస్తవాల వక్రీకరణల ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్న కార్పొరేటు యాజమాన్యాల పెడధోరణుల నుండి మీడియాను సంరక్షించుకోవాలి. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు అందించే మహత్తర బాధ్యత కలిగిన మీడియాను రుగ్మతల నుండి విముక్తి చేయాలి. వృతి ప్రమాణాలు, విలువల పట్ల నిబద్ధత గల పాత్రికేయులు , ప్రజాస్వామ్య ప్రియులు, పాఠకులు, వీక్షకులు కలిసికట్టుగా కృషి చేస్తే మీడియా స్వరూప, స్వభావాలను మార్చడం సాధ్యమే.

డి. సోమసుందర్

### ఆర్థిక సంక్షోభానికి మూలాల్ని

### అందరి కంటే ముందు, 23 ఏళ్ల కిందటే చెప్పినా

# గట్టిగా పట్టించుకోలేదు..

## దేశం గురించి తప్ప లోక్‌సత్తా పార్టీ గురించి దిగులక్కర్లేదు: జేపీ



లోక్‌సత్తా పార్టీ ఆశించిన విజయాల్ని ఇంకా సాధించలేదన్న దిగులు తనకు ఏమాత్రం లేదని.. ఎన్నికల్లో గెలిచిన పార్టీలు 1% ఫలితాల్ని సాధిస్తుంటే, లోక్‌సత్తా 15% మించి విజయాల్ని సాధిస్తోందని వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సాధించాల్సింది చాలా ఉన్నా, సాధించినవి చిన్న విజయాలు కాదన్నారు. లోక్‌సత్తా పార్టీ 13వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర విభాగం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మనం ఎన్నికల్లో గెలుపుని మాత్రమే విజయంగా చూస్తున్నాం తప్ప, ఎందుకోసం గెలిచారో ఆ లక్ష్యంలో వారు విఫలమవటాన్ని పట్టించుకోవటం లేదని జేపీ అన్నారు. ఎన్నికలు మార్గమేతప్ప లక్ష్యం కాదు అనే స్పష్టత మనకు వస్తే.. ప్రధాన రాజకీయ పార్టీల కంటే లోక్‌సత్తా ఈ దేశానికి, సమాజానికి ఎంత గణనీయమైన సేవల్ని అందిస్తోందో అర్థమవుతుందన్నారు. రాజకీయ, పాలనా సంస్కరణలు లేకుండా ఈ దేశంలో ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికంటే ముందు 23 ఏళ్ల క్రితమే లోక్‌సత్తా సమగ్ర పరిష్కారాలతో చెప్పిందని, ఆ మాటల్ని మన రాజకీయ పార్టీలు, సమాజం గట్టిగా పట్టించుకుని ఉంటే ఈవేళ దేశంలో ఆర్థికమాంద్యం పరిస్థితే తలెత్తేది కాదన్నారు (అంతకు ముందు సివిల్ సర్వెంట్‌గా కూడా ఈ పరిష్కారాల కోసం జేపీ ప్రయత్నిస్తుండేవారు. జిల్లాను యూనిట్‌గా చేసి స్థానిక స్థాయి వరకూ అధికార వికేంద్రీకరణతో 'జిల్లా ప్రభుత్వాల్ని' ఏర్పాటు చేయాలని 1987లోనే అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీకి జేపీ వివరించారు. ఆ తర్వాత స్థానిక ప్రభుత్వాల సాధికారతకు రాజీవ్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు వివిధ రాజకీయ పరిణామాల వల్ల అమల్లోకి రాలేదు. చివరికి రాజీవ్ గాంధీ హత్యానంతరం జాతీయ స్థాయిలో మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 73, 74 రాజ్యాంగ సవరణల్ని తీసుకొచ్చింది. అయితే స్థానిక స్వయంపాలనకన్నా పదాడంబరాలకు, పేజీల సంఖ్యకు ప్రాధాన్యమిచ్చి ఆ రాజ్యాంగ సవరణల్ని సారహీనంగా రూపొందించటం వల్ల.. లక్ష్యం

నీరుగారి దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ భారత్‌లో స్థానిక ప్రభుత్వాల సాధికారత సాకారం కాలేదు).

మనకున్న ఆర్థిక సంక్షోభం ప్రపంచ ఆర్థికమాంద్యం వల్ల కాదని.. ఆర్థిక చిట్కాల్ని తప్ప పాలనా, రాజకీయ సంస్కరణల్ని తేకపోవటమే మన దేశ ఆర్థిక పునాదిని గుల్లబారుస్తోందని జేపీ అన్నారు. ఈ దేశంలో ప్రతి బిడ్డకూ నాణ్యమైన చదువు, ప్రతి కుటుంబానికీ మంచి ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, అందరికీ సత్వర, సమ న్యాయం వంటివి ఇంకా అందుబాటులోకి రాలేదే, 100 చేయాల్సిన చోట 15 -20 మాత్రమే చేయగలిగామే, ఎంతో ముందుగానే కాలికి బలపం కట్టుకుని తిరుగుతూ హెచ్చరించినా సమాజం, రాజకీయ వ్యవస్థ ఆశించినంతగా స్పందించలేదే అనే బాధ తప్ప.. లోక్‌సత్తా పార్టీ విజయాల గురించి తానే మాత్రం దిగులు చెందటం లేదని జేపీ వ్యవస్థ మనకు లేకపోవటం వల్ల మనం అవరోధాల్ని ఎదుర్కోవలసి వస్తోందన్నారు. ప్రజల ఆదాయాలు ఎక్కువగా ఉండటం, కాస్మో కల్చర్, అన్నిటినీ మించి స్వయం పాలనాధికారాలు గణనీయంగా ఉన్న ఓ పెద్ద నగర ప్రభుత్వంలా ఉండటం వల్ల ఢిల్లీలో కొత్త రాజకీయానికి కొంత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, జాతీయ మీడియా విస్తృత ప్రచారాన్నిచ్చిన అన్నా హజారే అవినీతి వ్యతిరేక పోరాటం అక్కడే జరగటం వంటివి కూడా కలిసిరావటం వల్ల లోక్‌సత్తా స్ఫూర్తితో ప్రారంభమైన 'ఆప్' అక్కడ మంచి ఎన్నికల విజయాన్ని సాధించిందని



అన్నారు. ఒక్క ఎంపీ లేకున్నా ఈ దేశంలోని మిగతా రాజకీయ పార్టీలకన్నా లోక్‌సత్తా సాపేక్షంగా అనేక రెట్లు ఎక్కువ విజయాల్ని సాధించిందని, అన్నిటికన్నా ముఖ్యంగా ఈ దేశంలో రాజకీయ పరివర్తనకు ఒక బలమైన పునాదిని, స్పష్టమైన దిశను అందించిందని అన్నారు.

### రజనీకాంత్ పార్టీ కన్నా ఎక్కువ స్పందన వచ్చింది

వచ్చిపోయే లాంతర్లలా కాకుండా, జాతికి అజరామర దిశానిర్దేశం చేసే నక్షత్రం లోక్‌సత్తా భావజాలం అని జేపీ అన్నారు. 2006లో లోక్‌సత్తా రాజకీయ ఉద్యమాన్ని విస్తరిస్తూ పార్టీని ప్రారంభించినప్పుడు డబ్బులిచ్చి మరీ సభ్యులుగా నమోదయ్యేందుకు ప్రజలు క్యూలు కట్టారని, రెండు మూడు వారాల్లోనే 6 లక్షల మంది సభ్యులయ్యారని.. అదే ఇటీవల తమిళనాడులో సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ పార్టీ సభత్వం కోసం ఉచితంగా, సెల్‌ఫోన్‌లో ఒక బటన్ నొక్కండి చాలు అని ప్రకటనలిస్తే రెండు మూడు నెలల్లో కేవలం రెండు లక్షలమంది నమోదైనట్లు సమాచారమన్నారు. లోక్‌సత్తాకు ప్రజల్లో ఇంత ఆదరణ, గౌరవం, ప్రేమ ఉన్నా అవి ఓట్లుగా మారే ఎన్నికల అన్నారు. ఆ పరిస్థితులేవీ లేకపోవటం, ముఖ్యంగా నగర పాలనా సంస్థలకు ప్రజల సమస్యల్ని పరిష్కరించే అధికారాలు, నిధులు లేకపోవటం వల్ల ముంబయి, బెంగళూరు వంటి చోట్ల కూడా అలాంటి విజయాలు సాధ్యం కాలేదన్నారు. ముంబయిలో, బెంగళూరులో పోటీ చేసిన నియోజకవర్గాల్లో లోక్‌సత్తాకు 2.5 శాతం దాకా ఓట్లు రాగా, 2014, ఆ తర్వాత ఎన్నికల్లో ఆప్ విస్తృత ప్రచారంతో పోటీచేసినా బెంగళూరులో ఆ పార్టీకి 0.5 - 1% శాతం ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు.

### కాకతాళీయం కాదు

లోక్‌సత్తా పార్టీని మహాత్మాగాంధీ జన్మదినోత్సవం రోజున ప్రారంభించటం కాకతాళీయం కాదని, దాని వెనుక స్పష్టమైన ఉద్దేశం ఉందని జేపీ వివరించారు. వేల సంవత్సరాల మన చరిత్రలో ఎన్నడూ సాధ్యంకాని పనిని గాంధీ చేసి చూపారని, 'మనందరికీ ఉమ్మడి ప్రయోజనాలున్నాయి, మనందరి భవిష్యత్తూ ఒక్కటే' అనే భావనను భారతదేశంలోని అనేక రకాల కులాలు, మతాలు, తెగలు, ప్రాంతాల ప్రజల మధ్య తేగలిగారని అన్నారు. ఒక జాతిగా, దేశంగా భారత్‌ను ఏకం చేశారన్నారు.

గాంధీజీ ఈ దేశంలో కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అందరి హృదయాలనూ స్పృశించటం వల్ల ఏర్పడిన వాతావరణంలో అంబేద్కర్ తన సామాజిక కృషిని వేగంగా విజయవంతం చేయగలిగారని ఒక కన్నడ రచయిత ఇటీవల ఇంటర్వ్యూలో చెప్పిన మాటల్ని తోసిపుచ్చలేమన్నారు. కుల, లింగ, కట్టుబాట్లు, ఛాందస మత సాంప్రదాయాల ప్రభావం నుంచి ఇప్పటికీ బైటపడలేని వారు మన చుట్టూ ఉన్నారని.. ఇలాంటి దేశంలో వందేళ్ల క్రితం గాంధీ ప్రజల్ని ఏకం చేసి ఉమ్మడి లక్ష్యం దిశగా నడిపించారంటే ఎంత కృషి చేసి ఉంటారో, ఎంత నైతిక రాజకీయ శక్తిని ప్రదర్శించి ఉంటారో ఊహించుకోవచ్చాన్నారు. 8 ఏళ్ల వయసులో పెళ్లయిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అనే ఒక సాధారణ బాలికను గొప్ప నాయకురాలిగా తీర్చిదిద్దిన నాయకత్వ పటిమ గాంధీజీదన్నారు. ప్రపంచంలో, ఏ దేశంలో, ఎవరూ తయారుచేయలేనంతమంది



నాయకుల్ని మన జాతీయోద్యమంలో తయారుచేసి భారత్‌కు ఆయన అందించారన్నారు. అనితర సాధ్యమనిపించే ఈ లక్ష్యాన్ని గాంధీజీ నైతిక రాజకీయంతో సాధిస్తే, ఆ నైతిక రాజకీయం కూలిపోకుండా వ్యవస్థీకృతంగా నిలదొక్కుకునేందుకు కావలసిన ఉదాత్త రాజ్యాంగాన్ని డా॥ అంబేద్కర్ తన దిశానిర్దేశంలో రూపొందించి అందించారన్నారు. ఈ నేపథ్యంలోనే గాంధీ, అంబేద్కర్‌లను ఐకాన్లుగా చేసుకుని లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించిందన్నారు.

**స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో రండి..**
**ఏ మార్గమైనా నాకు అభ్యంతరం లేదు**

లోక్‌సత్తా పార్టీ భవిష్యత్ ప్రణాళికను నిర్ణయించుకునే ముందు వీటన్నిటిపై స్పష్టత మనలో ప్రతి ఒక్కరికీ రావాలని జేపీ అన్నారు. వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలున్న, నివారించదగ్గ బాధలు లేని నూతన భారతదేశ నిర్మాణం మన లక్ష్యమని, ఈ దీర్ఘకాలిక లక్ష్యంలో భాగంగా ఎన్నికల్లో గెలుపు, అధికారం కూడా లభిస్తే సంతోషమేనని, అవి అనుకున్నదాని కంటే కొన్నేళ్లపాటు ఆలస్యమైనా కూడా దీర్ఘకాలిక లక్ష్యాన్ని మాత్రం నూరు శాతం నిబద్ధతతో కొనసాగించాలని జేపీ అన్నారు. ఎన్నికల రాజకీయమా, సామాజిక రాజకీయమా, రెండూ ఏకకాలంలోనా.. అనేది పరిస్థితులు, వనరులకనుగుణంగా చేద్దామని, స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో వస్తే ఏ మార్గమైనా తనకు అభ్యంతరం లేదని అన్నారు. స్పష్టతతో, ఆశావాదంతో, అంకితభావంతో పనిచేస్తుంటే లక్ష్యం దిశగా అనేక మైలురాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగగలమన్నారు.

**సేవాభావంగల యువతను,**
**పౌరుల్ని నాయకులుగా తయారుచేయండి**

సేవాభావంతో ముందుకొచ్చే పౌరుల్ని, ముఖ్యంగా యువతను స్థానికంగా ఎక్కడికక్కడ పరిజ్ఞానంతో పనిచేసే నాయకులుగా తయారుచేయాలని జేపీ కోరారు. లోక్‌సత్తాకు విధానపరమైన స్పష్టత, కావలసినంత సాహిత్యం ఉన్నాయని.. వాటిని తగినరీతిలో ఆకట్టుకునే మాడ్యూల్స్‌లా తయారుచేసి శిక్షణనివ్వాలన్నారు. పార్టీలకతీతంగా వచ్చేవారిని, ఇతర సంస్థల నుంచి ముందుకొచ్చేవారిని కూడా శిక్షణలో అనుమతించాలన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాల్ని సాధించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని, మాధ్యమాల్ని వినియోగించుకుంటూ లోక్‌సత్తా భావజాలాన్ని, కృషిని విస్తరింప చేయాలన్నారు. మనం ఓ కులంలో, మతంలో, ప్రాంతంలో పుట్టటమనేది యాదృచ్ఛికమని.. ఆ సంకుచిత ధోరణులకు అతీతంగా వ్యవహరించాలని అన్నారు. మనం ఎక్కడుంటే, ఎక్కడ పన్నులు కడుతుంటే అదే మన ప్రాంతమన్నారు. కులం, మతం, ప్రాంతం వంటి వాటి చుట్టూ విద్వేషాల్ని రెచ్చగొట్టే ధోరణుల్ని తిప్పికొట్టాలని.. వాస్తవాలు, హేతుబద్ధత, సాక్ష్యాధా రాలు, తర్కం, అందరి ప్రయోజనాల సమన్వయం గీటురాళ్లుగా బహిరంగ చర్చ ప్రమాణాలను పెంచాలని కోరారు. త్వరలో తెలంగాణలో సురాజ్య యాత్రను చేపడతానన్నారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వర్మ, కార్యదర్శి బొర్రా శివరామకృష్ణ, సీనియర్ నేతలు కటారి శ్రీనివాసరావు, బండారు రామ్మోహన రావు, పి. భాస్కరరావు, నందిపేట రవీందర్, సరోజాదేవి, గన్‌రెడ్డి రాజారెడ్డి, లావణ్య, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు గుత్తాధిపత్యాన్ని తిరస్కరిస్తున్నారు, బలమైన ప్రతిపక్షాన్ని కూడా కోరుకుంటున్నారు

## మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికల తీర్పుపై జేపీ

మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో, పలు రాష్ట్రాల ఉపఎన్నికల్లో బీజేపీకి గణనీయంగా సీట్లు వచ్చినా ప్రతిపక్ష పార్టీలకు కూడా తక్కువ సీట్లేమీ రాలేదని.. రాజకీయాల్లో గుత్తాధిపత్యాన్ని మేం అంగీకరించబోమని దేశ ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బలమైన ప్రతిపక్ష పార్టీ కూడా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నట్లు ఫలితాలను చూస్తే అర్థమవుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ సహా ఎక్కడ, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇలా పోటీ ఉండటం మంచి పరిణామమన్నారు.

మహారాష్ట్ర, హర్యానా శాసనసభల తాజా ఎన్నికలు, హుజూర్‌నగర్ సహా వివిధ రాష్ట్రాల్లో ఉప ఎన్నికల ఫలితాలపై తనను కలిసిన మీడియాతో జేపీ మాట్లాడారు.



పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీవాతావరణం అనే మంచి పరిణామం ఈ ఎన్నికల్లో కనిపించినా.. నల్లడబ్బు, తాత్కాలిక తాయిలాలు, భావోద్రేకాలను రెచ్చగొట్టటం యథావిధిగా కొనసాగాయని, మరోవైపు విధానపరమైన అంశాల్లో చర్చ లేకుండా, పార్టీల మధ్య సరైన ప్రత్యామ్నాయం లేకుండా పోయిందని జేపీ అన్నారు. మొదటి పరిణామాన్ని ఆహ్వానిస్తూనే, మిగిలిన రెండు అంశాల మీద విస్తృత చర్చ జరగాలన్నారు.

ఎన్నికల్లో డబ్బు ఖర్చు పంచటం, తాయిలాల్ని ప్రకటించటం కొన్నేళ్లుగా కొనసాగుతుంది కాబట్టి అది మామూలే అని వదిలేయలేమని, వీటిని ప్రశ్నించటం, చర్చించటం జరగకపోతే ఎప్పటికీ పరిష్కారాలు రావని, పార్టీలు, నేతలు గెలుస్తుంటారు తప్ప సమాజం నాశనమవుతుంటుందని జేపీ అన్నారు. అలాగే ప్రజలు ఎన్నికల్లో పాల్గొనటానికి, ప్రభుత్వాలను ఎన్నుకోవటానికి మూలకారణాలైన విద్య-ఆరోగ్యం, ఉపాధి, మౌలిక వసతులు, అధికార వికేంద్రీకరణ, చట్టబద్ధపాలన వంటివి చర్చించి ఆ విధానాలను రాజకీయాలకు కేంద్రబిందువు చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసమే లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో నవంబర్ 14న హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి మేధావులతో సమావేశం, జనవరి 9, 10 తేదీల్లో హైదరాబాద్ ఐఎస్‌బీలో కార్యాచరణ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు.

హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ ఘనవిజయాన్ని ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ వైఖరిని బలపరచటంగా కూడా చూడాలి. రాజ్యాంగ ప్రమాణానికి విరుద్ధంగా ఫిరాయింపులు జరగటంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ప్రభావం, ధనబలం వంటి ఇతరత్రా కారణాల వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి మొగ్గు ఉంటుందని, కానీ హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార టీఆర్ఎస్ గెలుపు అంతకుమించిన పెద్దవిజయమని జేపీ అన్నారు. 40,000-50,000 మెజారిటీ చిన్న విషయం కాదన్నారు. మన ఎన్నికల్లో సిద్ధాంతాలు, విధానాల పాత్ర పెద్దలేకపోయినా, ఈ ఎన్నికను వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ఆర్టీసీ సమ్మె చుట్టూ తిప్పినందున హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో విధానాల ప్రభావం కొంతైనా ఉందన్నారు. బస్సులున్నది ప్రజల సేవ కోసమని, ఆ సేవకు భంగం కలగకుండా ప్రభుత్వం, ఆర్టీసీ కార్మికులు తమ మధ్య గొడవను పరిష్కరించుకోవాలని ప్రజలు భావించినట్లు కనిపిస్తుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం, ప్రైవేటు వాహనాల వినియోగం వంటి విధానపరమైన అంశాలను ప్రభుత్వానికి వదిలేయాలని, మిగతా విషయాల్లో తమ హక్కులకు సంబంధించిన సమస్యల్ని కార్మికులు ఎన్నికైన ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనే వాదనను ప్రజలు బలపరిచినట్లు కనిపిస్తుందన్నారు. ఒకరకంగా ఇది ప్రభుత్వ వైఖరికి గట్టి మద్దతును ప్రకటించినట్లన్నారు. ఎన్నికలే మనకు సర్వస్వం కాబట్టి, ఎన్నికల వేడి తగ్గింది కాబట్టి.. ఇప్పటికైనా ప్రభుత్వం మౌలిక అంశాల్లో రాజీపడకుండా కార్మికుల డిమాండ్ల పట్ల ఉదారంగా వ్యవహరించాలని,

కార్మికులు కూడా విధానపరమైన అంశాల్లో జోక్యం చేసుకోకుండా తమ హక్కుల కోసం సామరస్యంగా కృషి చేయాలని జేపీ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు చౌకగా, సౌకర్యవంతంగా, భద్రమైన ప్రయాణ సౌకర్యాన్ని ఖజానాపై భారం లేకుండా అందించటం లక్ష్యం కావాలన్నారు. ఆర్టీసీయా, ప్రైవేటా అన్న దాంతో సంబంధం లేకుండా ప్రజలకు సరైన రవాణా సౌకర్యం అందించాలని చెప్పిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. తన వైఖరిని తానే వ్యతిరేకిస్తూ టెలికాం రంగంలో రూ.40,000 కోట్లతో ప్రభుత్వ సంస్థను బలోపేతం చేయాలనే నిర్ణయం తీసుకుందని, ఇక్కడ తెలంగాణ రాష్ట్రంలోని బీజేపీ కేంద్రంలోని తన పార్టీ ప్రభుత్వ వైఖరికి విరుద్ధంగా ఆర్టీసీ విషయంలో వ్యవహరిస్తోందని అన్నారు. మన దేశంలో విధానాలపై చర్చ ఎంత పేలవంగా ఉందో రుజువు చేసేందుకు ఇదో తాజా ఉదాహరణన్నారు. ప్రభుత్వ ఫోనే కావాలని మనమేమన్నా కేంద్రాన్ని అడిగామా, వేల కోట్ల రూపాయల మన పన్నుల డబ్బును ఇష్టమొచ్చినట్లు టెలికాంలో ఖర్చు చేసే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారు? అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం చెబుతున్న 'కనిష్ఠ ప్రభుత్వం – గరిష్ఠ పాలన' సూత్రానికి కూడా ఇది పూర్తి విరుద్ధమన్నారు.

తెలంగాణలో ఇటీవల ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీకి ఈసారి హుజూర్‌నగర్‌లో ధరావత్తు కూడా లభించకపోవటంపై అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ, మన ఎన్నికల వ్యవస్థలో మొదటి రెండు పార్టీలకే తప్ప మూడో పార్టీకి అవకాశం ఉండదని, హుజూర్‌నగర్‌లో రెండో స్థానంలో కాంగ్రెస్ ఉండటం వల్ల ఈ తర్వాతి స్థానాల్లోని బీజేపీని, టీడీపీని ఓటర్లు పట్టించుకోలేదని జేపీ అన్నారు. ఇదే పరిస్థితి లోక్‌సత్తాకు కూడా పలు ఎన్నికల్లో ఎదురైందన్నారు. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మార్పులతో మన ఎన్నికల వ్యవస్థను సంస్కరించటమే ఇందుకు పరిష్కారమన్నారు.

### గవర్నర్ రోజువారీ పాలనలో జోక్యం చేసుకోకూడదు

ఆర్టీసీ సమ్మెలో గవర్నర్ జోక్యంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. ఆర్టీసీ సమ్మె కావచ్చు, మరోటి కావచ్చు గవర్నర్ అత్యుత్సాహంతో రోజువారీ పాలనలో జోక్యం చేసుకోవటం తగదని, పాలనను జాగ్రత్తగా గమనిస్తూ రాజ్యాంగ విలువల పరిరక్షణకే పరిమితం కావాలని జేపీ అన్నారు. గవర్నర్ల నియామకమే అపసవ్యమనుకుంటుంటే, వారి వ్యవహారశైలి కూడా అసంబద్ధంగా ఉంటే కొత్త సమస్యల్ని సృష్టిస్తుందన్నారు. ఏమైనా సూచనలుంటే ముఖ్యమంత్రికి ప్రైవేటుగా తెలియచేయవచ్చన్నారు.

గవర్నర్ మాత్రమే కాకుండా, న్యాయస్థానాలు కూడా నియంత్రణను పాటించాలని, అధికారాల విభజనను అతిక్రమించి సర్కారు విధుల్లో జోక్యం చేసుకుని అధికారులను, ప్రభుత్వాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేయటం తగదని జేపీ అన్నారు. డెంగీ జ్వరాలపై విచారణ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు తెలంగాణ ప్రభుత్వం, సీఎస్, ఇతర ఉన్నతాధికారులపై చేసిన వ్యాఖ్యల గురించి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. కోర్టులు ప్రజలకు గొంతుకనివ్వాలనుకోవటం మంచిదేగానీ, అది కోర్టుల పనికాదన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించటం ఎలా వంటి ఎన్నో సవాళ్లు న్యాయస్థానాలకున్నాయన్నారు. ఆ



పనుల్ని వదిలేసి ప్రభుత్వాలు, చట్టసభలు చేయాల్సిన పనుల్లో కోర్టులు జోక్యం చేసుకోవటం సరికాదన్నారు. న్యాయస్థానాల మితిమీరిన ధోరణి మనకు తాత్కాలికంగా సంతోషంగా అనిపించొచ్చుగానీ, సమస్య పరిష్కారమవదన్నారు. గతంలో కోర్టులు పలు అంశాలపై ఎన్నోసార్లు ఇలాంటి పరుష వ్యాఖ్యలు చేసినా ఎందుకు సమస్యలు పరిష్కారం కాలేదో ఆలోచించాలన్నారు. ఈ మాటల్ని తాను ఎంతో బాధ్యతతో, గౌరవభావంతో చెబుతున్నానన్నారు. డెంగీ జ్వరాలు ఇంత పెద్దఎత్తున ప్రబలటం ప్రజారోగ్య ఘోరవైఫల్యమనటంలో సందేహం లేదని, కానీ దాన్ని సరిచేయటానికి విధానపరమైన కృషి జరగాల్సుందని అన్నారు. సరైన ఆరోగ్యం, విద్య వంటి కీలకాంశాలపై విధానాల గురించి మనం చర్చించటం, పట్టించుకోవటం, వాటి కోసం ఓటు వేయటం చేసినప్పుడే మన సంక్షోభాలకు పరిష్కారం సాధ్యమవుతుందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# గాంధీతత్వం-4వ విప్లవం

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

మహాత్మాగాంధీ ఆధునిక ప్రపంచంలో మొట్టమొదటి పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి నాంది పలికిన దార్శనికులు. నూరేళ్ళ క్రితమే నేటి పారిశ్రామిక యుగంలో అతివినిమయ సంస్కృతి పెరిగే ప్రమాదముందని, అందువల్ల ప్రకృతిలో సమతూకం దెబ్బతింటుందని ఆయన గుర్తించారు. 'ప్రకృతి మానవాళి అవసరాలకి తగినంత సమకూరుస్తుంది; కాని మనమంతా అత్యాశకి పోయి ప్రకృతిని విస్మరిస్తే అది వినాశనానికి దారితీస్తుంది' అని గాంధీజీ హెచ్చరించారు. ఆ నినాదమే నేటి పర్యావరణ ఉద్యమానికి నిరంతరం దారి చూపే వేగుచుక్క.

ఈనాడు పర్యావరణ పరిరక్షణలో భాగంగా అనవసర వినియోగాన్ని తగ్గించటం **(Reduce)**, మళ్ళీ మళ్ళీ వస్తువులని వినియోగించటం **(Reuse)**, వాడిన వస్తువునో పదార్థాన్నో మళ్ళీ మళ్ళీ పునరావృత్తం చేయటం **(Recycle)** ప్రధాన పద్ధతులయ్యాయి. గాంధీజీ మన సంప్రదాయంలో ఉన్న పొదుపరితనాన్ని, ప్రకృతిలో సమతూకాన్ని పాటించే పద్ధతులని నిరంతరం పాటించి, వాటిని ప్రచారం చేశారు.

మన సాంప్రదాయంలో ఇళ్ళు గతంలో కలపతోను, తాటాకుతోను నిర్మించేవారు. అందులో వాతావరణ కాలుష్యం లేదా వ్యర్థ పదార్థాలు ఉండవు. కాలం గడిచాక ఆ పదార్థాలన్నీ మళ్ళీ మట్టిలో కలసిపోతాయి. అలాగే బట్టలని తయారుచేయటానికి వ్యవసాయం నుంచి ఉత్పత్తి చేసిన ప్రత్తిని, మన కండర శక్తితో పనిచేసే రాట్నాన్ని, చేనేత మగ్గాలని వాడే వాళ్ళం. భోజనానికి, నీళ్ళ నిలవకి మట్టిపాత్రలని లేదా చిరకాలం ఉండే లోహపు పాత్రలని వాడేవాళ్ళం. ప్రయాణానికి కాలినడకనో, లేదా పెంపుడు జంతువులతో నడిచే బండినో, జట్కానో వాడేవాళ్ళం. వంటకి ఇంధనంగా కట్టెలని, పిడకలని వాడేవాళ్ళం. చెత్తకుప్పలలోంచి వచ్చిన సేంద్రియ ఎరువులని పొలాలలో వాడేవాళ్ళం. ఇలా ప్రకృతితో కలసిమెలసి జీవించటం మన సంప్రదాయంలో, సంస్కృతిలో భాగమయింది.

కాని గాంధీజీ హెచ్చరించినట్లుగా యాంత్రిక యుగంలో ఈ పరిస్థితి కాలక్రమేణా మారిపోయింది. ఇటీవలి కాలంలో అది మానవాళి భవిష్యత్తుకి తీవ్ర ప్రమాదంగా పరిణమించింది. ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 20వ శతాబ్దాన్ని గూర్చి మాట్లాడుతూ, "మనం సాధనలో పరిపూర్ణత్వాన్ని సాధించాం; కాని లక్ష్యాలేమిటో మరచి గందరగోళంలో పడ్డాం" అని వ్యాఖ్యానించారు. మనిషి జీవితంలో ఇప్పుడున్నంత సంపద, సౌఖ్యాలు చరిత్రలో మరెన్నడూ లేవు. కాని ప్రకృతితో సమతూకాన్ని మరచిపోయి నిర్లక్ష్యం చెయ్యటం వల్ల అసలు మానవాళి మనుగడే ప్రశ్నార్థకమౌతుందని మరచిపోయాం.

గాంధీజీ పర్యావరణాన్ని గూర్చి ఇచ్చిన సందేశాన్ని ఈనాటి పరిస్థితులకి అన్వయించుకుని పరిష్కారాన్ని అన్వేషించటం, అమలు చెయ్యటం అవసరం. మన అదృష్టంకొద్దీ సమస్యని సృష్టించిన మనం ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో, మనకున్న అపారమయిన వనరులతో మళ్ళీ ప్రకృతితో సహజీవనం చెయ్యటం సాధ్యం. ఈనాటి శాస్త్ర విజ్ఞానం, వనరులు, సద్వినియోగం చేసుకుంటే, కులం, మతం, ప్రాంతం, దేశం లాంటి కృత్రిమమయిన అడ్డుగోడల్ని కూలగొట్టి మానవజాతిగా మనం మేలుకుని పరస్పర సహకారంతో కృషి చేస్తే, గత రెండు శతాబ్దాలుగా, ముఖ్యంగా గత నూరేళ్ళుగా మన వల్ల జరిగిన పొరపాటుని సరిదిద్దుకోవచ్చు; మన భవిష్యత్తు తరాలకి ప్రమాదాన్ని నివారించి అందమయిన




భవిష్యత్తుకి బాట వేయవచ్చు.

పారిశ్రామిక విప్లవం, అతివినిమయ సంస్కృతుల వల్ల మనం మూడు ప్రధాన సవాళ్ళని ఎదుర్కొంటున్నాం.

మొదటిది, పెరుగుతున్న కాలుష్యం వల్ల మన ఆరోగ్యానికి, అన్ని జీవరాసులకి పొంచిఉన్న ప్రమాదం. మన ఉత్పత్తిక్రమంలోనే తీవ్రంగా వ్యర్థ పదార్థాలని వదిలిపెట్టి మనం పీల్చేగాలిని, త్రాగేనీటిని, మనం పంటలు పండించే భూమిని విషతుల్యం చేస్తున్నాం. అయితే ఆ కాలుష్యాన్ని నివారించేందుకు, తొలగించేందుకు అవసరమయిన సాంకేతిక పరిజ్ఞానం మనకందుబాటులో ఉంది. **(3D- Printing)** – దాన్నే **(Additive manufacturing)** అంటాం– దాని ద్వారా వృధాని పూర్తిగా అరికట్టి వస్తువులని ఉత్పత్తి చేసే పరిజ్ఞానం మనకి అందుబాటులోకి వచ్చింది. అలాగే కాలుష్యరహితంగా ఉత్పత్తి చేసే శక్తి పెరుగుతోంది. గతంలో కాలుష్యాన్ని పెంచిన ప్రమాదకరమయిన కొన్ని పద్ధతులకి మానవాళి ఇప్పటికే సాధించిన గొప్ప విజయం. అలాగే ఇతర సాంకేతిక పరిజ్ఞానాలతో మన ప్రకృతి కాలుష్యాన్ని ఎదుర్కోవటం నేడు మన చేతుల్లో పని.

ఇక రెండో పెద్ద సమస్య, **Plastics** లాంటి చిరకాలం నిలవ ఉండి కుళ్ళిపోని పదార్థాల వాడకంతో సముద్రాలలో, భూమి మీద అన్ని జీవరాసులకి దీర్ఘకాలం ప్రమాదం ముంచుకొచ్చింది. ఒకప్పుడు కారుచవకగా, సులభంగా ఉత్పత్తి చేసి ప్రతి పనికి **Plastics** ని వాడటం ప్రగతి చిహ్నంగా మనం భావించాం. యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రమాదాన్ని నివారించటం అత్యవసరం. అందుకు తగ్గ సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యామ్నాయ పదార్థాలు మనకందుబాటులో ఉన్నాయి. మళ్ళీ మళ్ళీ కాలుష్యరహితంగా





స్వస్తి చెప్పి, పరిష్కారంలో భాగమయింది. ఉదాహరణకి పెట్రోలియం ఇంధనంలో సీసాన్ని గతంలో కలిపేవారు. ఆ సీసం **(LEAD)** కాలుష్యం వల్ల మనందరి ఆరోగ్యానికి ప్రమాదం ముంచుకొచ్చింది. మానవాళి అంతా పూనుకుని ప్రత్యామ్నాయ పద్ధతులతో సీసం కాలుష్యాన్ని ఆపగలిగింది. అలాగే మన **AC** లలో, **refrigirator**లలో వాడే రసాయనాలు–**CFC**ల వల్ల– భూగోళాన్ని ఆవరించి ఉండే ఓజోన్ పొరకి తూట్లు పడి సూర్యరశ్మిలో ఉండే **Ultra violet** కిరణాల బారిన పడి మానవాళి అంతా ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చింది. కాని ప్రపంచ దేశాలన్నీ కలిసి **CFC**ల వినియోగాన్ని నిషేధించగలిగాయి, ప్రత్యామ్నాయ పద్ధతులని ఉపయోగించి ఓజోన్ పొరలోని రంధ్రాలని పూడ్చేయగలిగాయి. ఇది మానవాళి ఉమ్మడిగా

వాడే గుడ్డ సంచులు, నార సంచులు, కాగితం సంచులు, ఇతర ఉత్పత్తుల వాడకాన్ని ప్రపంచమంతటా వ్యాప్తి చేయటం సాధ్యం, అవసరం. అలాగే ఇప్పటికే ఉత్పత్తయిన **Plastics** వ్యర్థాలని పూర్తిగా కాలుష్యరహితంగా ధ్వంసం చేయటానికి, లేదా **Plastics** చెయ్యటానికి కావలసిన పరిజ్ఞానం మనకుంది.

మూడో పెద్ద సమస్య, మన వాతావరణ ఉష్ణోగ్రతని పెంచి ధ్రువ ప్రాంతాలలోని మంచుగడ్డలని కరగించి సముద్రమట్టాన్ని పెంచి మానవజాతి భవిష్యత్తుని అతలాకుతలం చేస్తున్న **Plastics recycle** వాయువుల విడుదల. నేటి ప్రపంచంలో విద్యుత్తు లేకుండా జీవించలేం. కాని అందుకు కార్బన్‌డైఆక్సైడ్‌ని విడుదల చేసి, కాలుష్యాన్ని పెంచే బొగ్గునో, ఇతర శిలాజాల ఇంధనాలనో– అంటే

సహజ వాయువు, ఇతర పెట్రోలియం ఉత్పత్తులని గత శతాబ్దంగా వాడుతున్నాం. అలాగే గత శతాబ్దంగా మోటారువాహనాలు మన జీవితంలో అంతర్భాగమయినాయి. వాటికి పెట్రోలియం ఉత్పత్తులని వాడుతున్నాం. అదేరీతిన పరిశ్రమలలో ఉత్పత్తికి ఇంధనాన్ని వాడుతున్నాం. వీటికి ప్రత్యామ్నాయాలని ఉపయోగించి **AC** వాయువుల ఉద్గారాన్ని ఆపటం, కాలుష్యాన్ని అంతం చెయ్యటంతోపాటు వాతావరణంలో వేడిని నివారించటం ఇప్పుడు మానవాళి ముందున్న అతిపెద్ద సవాలు. ఇందుకు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆచరణసాధ్యమయిన, చవకయిన పరిష్కారాలని మనకిస్తున్నది. సూర్యరశ్మి నుంచి, వీచేగాలి నుంచి, ఇతర పద్ధతుల ద్వారా కాలుష్యరహితంగా, చవకగా, శాశ్వతంగా, సులభంగా విద్యుత్తుని ఉత్పత్తి చేయటం ఈనాడు సాధ్యం. దాంతోపాటు ఉత్పత్తి చేసిన విద్యుత్తుని అవసరమయినప్పుడు వినియోగించటానికి వీలుగా బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు చవకగా అందుబాటులోకి వచ్చింది. విద్యుత్ మోటారు వాహనాలు, **Fridge**లు లేకుండానే, విద్యుత్తుని ఉపయోగించకుండానే ఇంట్లో వేడిని తగ్గించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, వృక్షసంపద నుంచి ఇంధనాన్ని కాలుష్యరహితంగా ఉత్పత్తి చేసే పరిజ్ఞానం- ఇవన్నీ రాబోతున్న నాలుగో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతున్నాయి. తొలి పారిశ్రామిక విప్లవంలో యంత్రాలు రాగా, రెండో విప్లవంలో కార్లు వగైరా వినిమయ వస్తువులు వచ్చాయి. మూడో **Electronic Computer**లు, యుగంలో సెల్‌ఫోన్‌లు, వగైరా ఇతర ఆధునిక ఉత్పత్తులు వచ్చాయి. రాబోయే 4వ విప్లవంలో వస్తు ఉత్పత్తిలో **3D-Printing, Robotics** కాలుష్యరహిత ఇంధనాలు, విద్యుత్ వాహనాలు, జీవశాస్త్రంలో జన్యు టెక్నాలజీలు మానవాళి భవిష్యత్తుని సమూలంగా మార్చబోతున్నాయి. మానవాళి ఆర్థిక, సామాజిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ- రెండింటినీ సమపాళ్ళలో సాధించాలనే మహాత్మాగాంధీ హెచ్చరిక సార్వకాలీన మయినది; సార్వజనీనమయినది. ఏ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం సమస్యలని సృష్టించిందో, అదే పరిజ్ఞానం సమస్యల పరిష్కారానికి మార్గాలని చూపుతోంది. తాత్కాలిక లబ్ధి కోసం పాకులాడకుండా దీర్ఘకాల ప్రయోజనాల కోసం మనమంతా నడుం కడితే, సంకుచితత్వాన్ని, విభేదాలని విస్మరిస్తే, సంఘటితంగా పనిచేస్తే, మన బిడ్డలకి అందమయిన భవిష్యత్తుని ఇవ్వగలం. నేటి సుఖం రేపటి సంతోషానికి, భవిష్యత్తు తరాల మనుగడకి ప్రమాదంగా పరిణమించకూడదు. గాంధీజీ కోరుకున్నది అదే.

**(గాంధీజీ 150వ జయంతి సందర్భంగా ఆలిండియా రేడియోలో జేపీ ఇచ్చిన ప్రసంగం)**

# తేజస్ రైలులో 'హక్కుగా పౌరసేవలు'

రైల్వే ప్రైవేటీకరణలో తొలి అడుగైన తేజస్ రైలు గంట కంటే ఆలస్యమైతే 'సర్వీస్ గ్యారంటీ' పరిహారం చెల్లిస్తామని చెప్పిన రైల్వే శాఖ మాట నిలబెట్టుకుంది. రైల్వే చరిత్రలో తొలిసారిగా సేవల్లో జాప్యానికి పరిహారం చెల్లించింది. అక్టోబర్ 19న లక్నో-ఢిల్లీ-లక్నో తేజస్ ఎక్స్‌ప్రెస్ రెండు వైపులా ఆలస్యమైంది. ఉదయం 6.10 గంటలకు లక్నోలో బయల్దేరాల్సిన రైలు 9.55కి బయలుదేరింది. దీంతో ఢిల్లీకి చేరటంలో, అక్కడ్నుంచి బయల్దేరి మళ్లీ లక్నోకు రావడంలోనూ ఆలస్యమైంది. ఆలస్యాన్ని బట్టి లక్నో-ఢిల్లీ రైల్లో 450 మందికి రూ.250 చొప్పున, ఢిల్లీ-లక్నో రైల్లో 500 మందికి రూ.100 చొప్పున మొత్తం రూ.1,62,000 లను ఐఆర్‌సీటీసీ బీమా ద్వారా చెల్లిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది.



# మనోడికి 'నోబెల్'

## మన చర్చను కొంతైనా మార్చగలదా?

**అక్షరసత్యాలకన్నా భౌతిక అనుభవాలకు, వ్యక్తిత్వంకన్నా వ్యక్తిగత ఆర్భాటాలకు, నాయకత్వంకన్నా పదవులకు, పాలనకన్నా ఈవెంట్ మేనేజ్‌మెంట్లకు, వాస్తవాల కన్నా ప్రచార పటాటోపాలకు, శాస్త్రీయతకన్నా సెంటిమెంట్లకు, దీర్ఘకాలిక ప్రయోజనాలకన్నా తాత్కాలిక ఆకర్షణలకు, విజ్ఞతకన్నా వివక్షకు ప్రాధాన్యత ఇచ్చే మన దేశం నుంచే అమెరికా వెళ్లిన అభిజిత్ వినాయక్ బెనర్జీ.. హేతుబద్ధత, సాక్ష్యాలు, తార్కిక ప్రశ్నలు, క్షేత్రస్థాయి పరిశీలన, చిన్న స్థాయి ప్రయత్నాలు ద్వారా చేసిన కృషి, సాధించిన విజయాలకు ఆర్థికశాస్త్రంలో 2019 నోబెల్ బహుమతి రావటం భారతదేశం గర్వించదగ్గ పెద్ద సానుకూల పరిణామం. అభిజిత్‌తోపాటు కృషిలో, బహుమతిలో భాగస్వాములైన ఆయన భార్య ఎస్తేర్ డుఫ్లో, మరో ఆర్థికవేత్త మైఖేల్ క్రెమర్‌లు కూడా అంతే అభినందనీయులు.**

ఆర్థికరంగంలో తన ప్రయత్నాలు, ప్రయోగాలకు సరైన పద్ధతినే కాకుండా.. సరైన లక్ష్యాన్ని కూడా అభిజిత్ ఎంచుకున్నారు. వైద్యరంగం తరహాలో ర్యాండమైజ్డ్ కంట్రోల్ ట్రయల్స్ (ఆర్‌సీటీ) ద్వారా 'పేదరిక నిర్మూలన' అనే ఒక ఓ భారీ లక్ష్యం కోసం ఆయన దృఢసంకల్పంతో పనిచేశారు. 'పూర్ ఎకనామిక్స్' పుస్తకంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అభిజిత్ తన బృందంతో కలిసి 2003లో ప్రారంభించిన అబ్దుల్ జమీల్ లతీఫ్ పేదరిక కార్యాచరణ ప్రయోగశాల (జే-పాల్).. వందలాది పరిశోధకులు, సహాయకులతో పాఠశాలల్లో దిగజారిన విద్యాప్రమాణాలు, పిల్లల్లో అనారోగ్యం తదితర అంశాల మీద ఒక ఉద్యమంలా పనిచేసింది. పేదలు స్పందించి, నిర్మాణాత్మక భాగస్వాములయ్యేలా పేదరిక నిర్మూలన పరిష్కారాలను ఎలా అమలు చేయాలో తగిన పరిశోధన, డేటాతో నిర్దిష్ట పరిష్కారాలను అందించింది. పాత పద్ధతినే కొత్తగా ఉపయోగించుకుని 'అభివృద్ధి ఆర్థికం'లో వినూత్న ఒరవడిని తీసుకొచ్చింది.

కొన్ని పరిమితులు, ఎన్ని రాజకీయ విమర్శలు ఉన్నా.. అభిజిత్ తీసుకున్న ప్రమాణాలు, చేసిన ప్రయత్నం, సాధించిన ఫలితాలు సూక్ష్మ స్థాయిలో, అమలు క్రమంలో ప్రాధాన్యత కలిగినవి. గ్యాస్ సబ్సిడీకి ఆధార్‌ని లింక్ చేయటం వల్ల భారతదేశ ఖజానాకు వేల కోట్ల రూపాయలు ఆదా అయ్యాయి. దీన్ని ప్రభుత్వం ఓ పెద్ద సంస్కరణగా, తమ ఘనవిజయంగా చాటుకో గలిగినప్పుడు.. అభిజిత్ కృషి కూడా పెద్ద ఆర్థిక సంస్కరణల్లో భాగమవదా మరి! నోబెల్ కమిటీ ప్రశంసించినట్లు.. వీరి అధ్యయనాల వల్ల ప్రపంచ జనాభాలో ఎక్కువమంది నివసిస్తున్న ఆసియా, ఆఫ్రికాల్లో లక్షలమంది పిల్లలు మెరుగైన చదువుతో బాగుపడ్డారు, పలు దేశాల్లో భారీ రాయితీ ఆరోగ్య పథకాలు అమలయ్యాయి. ఈ నేపథ్యంలో.. ఒక దేశంగా ఈ అంశాల్లో మన పరిస్థితి ఏమిటి అన్నది మనకు ప్రధాన చర్చ కావాలి.

అభిజిత్ భారత్‌లో పుట్టి పెరగటమే కాదు, తన బృందంతో కలిసి భారత్‌లో కూడా కృషిని చేశారు కాబట్టి.. వారు పనిచేసిన రంగాల్లో, అంశాల్లో మన దేశంలో జరుగుతున్న రాజకీయ, పాలనా కృషిపై ఆత్మపరిశీలనకవసరం మరింత ఎక్కువ ఉంది.

పేదరిక నిర్మూలన అంటూ మన దేశంలో ప్రభుత్వాలు కొన్ని



దశాబ్దాలుగా భారీ బడ్జెట్లతో పథకాలను అమలు చేస్తున్నాయి. ప్రతి ఎన్నికకూ ఓ కొత్తరకం పథకాన్ని సృష్టించి రాజకీయ పార్టీలు ఓట్లు దండుకుంటున్నాయి. అయినా ఇన్నేళ్లయినా పేదరికం ఒక విషవలయంలానే మన దేశంలో కొనసాగుతోంది. పేదరికం నిర్వచనం పరిధిలోకి రానివారు కూడా రోజూ బితుకుబితుకుమంటూ భవిష్యత్తు పట్ల భయంతో, అభద్రతతో బతుకుతున్నారు. మరి అభిజిత్ బృందం చెప్పిన విషయాల తరహా పద్ధతులు, పేదరిక నిర్మూలన విధానాలు ఇంతవరకూ మనకు తెలియవా?

సోదరుడు అభిజిత్‌లాగానే భారతీయుల్లో చాలామంది పేదలను ఇష్టపడతారు, పేదల పక్షపాతులమని చెప్పుకుంటారు,

పేదలకు సాయం చేయటం ద్వారా పొందే సంతోషానికి ప్రచారం ద్వారా రంగులద్దుకునేందుకు వీలైనంత ప్రయత్నిస్తుంటారు.. కానీ అభిజిత్‌లాగా పేదరికం పోవటానికి సీరియస్ పరిష్కారాల మీద మాత్రం మనలో చాలామంది దృష్టి పెట్టలేదు. మౌలిక పరిష్కారాలను అస్సలు పట్టించుకోలేదు. అభిజిత్ సూక్ష్మస్థాయిలో చెప్పిన అంశాలను స్థూలస్థాయి/వ్యవస్థీకృత విధానాలుగా అట్టడుగు స్థాయి వరకూ అమలు చేసి సమగ్ర ఫలితాలు సాధించిన దేశాల ఉదాహరణలు నిరూపిత సత్యాల్లా మన కళ్ల ముందు కనిపిస్తున్నా.. పట్టించుకోలేదు. అదీ మన దేశంలో అసలు సమస్య.

'ప్రపంచంలో ఏ దేశంలోనైనా, ఏ తరంలోనైనా నాణ్యమైన విద్య, ఆరోగ్యం లేకుండా పేదరికం పోయిన దాఖలాలున్నాయా?' అన్న ఒక్క ప్రశ్నను వేసుకోవటానికి, సమాధానాన్ని స్వీకరించటానికి ఒక సమాజంగా మనమూ, పాలకులుగా మనం ఎన్నుకున్న ప్రతినిధులూ సిద్ధపడలేదు. డయాగ్నొసిస్‌ని కరెక్టుగా చేసి, రోగాన్ని కచ్చితంగా నిర్ధారించినా, సరైన మందులు అందుబాటులో ఉన్నా.. గాలివాటపు రోగనిర్ధారణ, తప్పుడు మందులు, చికిత్సతో ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే అరకొర, నకిలీ డాక్టర్ల తరహాలో మన రాజకీయ నాయకులు ఇప్పటికీ వ్యవహరిస్తున్నారు.

**ఈ ప్రశ్నల్ని వేసుకోవాలి**

'పేదరికం పోవాలంటే ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ ఆరోగ్యం కీలకం' అని ఒక నిత్యసత్యంలా, సార్వజనీన సూత్రంలా మనకు వివిధ దేశాల అనుభవాలు చాటిచెబుతున్నా.. ఈ వ్యవస్థీకృత/స్థూల విధానాలను మన కృషికి, సమాజానికి ఎందుకు మనం కేంద్రబిందువుల్ని చేయలేకపోయాం? ఒక్క కలంపోటుతో గొప్ప మార్పుల్ని తీసుకురాగల రాజకీయానికి ఎందుకు విద్య, ఆరోగ్యాలను కేంద్రబిందువుల్ని చేయలేకపోయాం? నాణ్యమైన విద్య అందకపోవటం వల్ల యువత ఉపాధి అవకాశాల్ని అందుకోలేక, సృష్టించుకోలేక పేదలుగా మిగిలిపోతున్నా, కేవలం వైద్య చికిత్స ఖర్చులకు చేసిన అప్పుల వల్ల ఏటా లక్షలమంది పేదరికంలోకి జారిపోతున్నా ఎందుకు గుర్తించలేకపోయాం? నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించకుండా పేదరిక నిర్మూలన చేస్తున్నామనటం.. పేదరికాన్ని నిరంతరం కొనసాగించే ప్రయత్నం కాదా? పేదరికాన్ని నిర్మూలించటం కాకుండా ఏదోకరూపంలో కొనసాగించే విధానాలనే సంక్షేమం పేరుతో అమలు చేస్తున్నది వాస్తవం కాదా? ఇది పేదలని తమ ఓటుబ్యాంకులుగా కొనసాగించటానికే కాదా? దేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుంచీ సోషలిస్టు భావజాలం ఉన్న వారు, కమ్యూనిస్టులు, నక్సలైట్లు సహా సాంప్రదాయ రాజకీయ పార్టీలన్నీ విద్య, ఆరోగ్యాల్ని నిర్లక్ష్యం చేసిన పాపంలో భాగస్వాములు కాదా?.. వ్యక్తిగతంగా, సమష్టిగా ఇప్పటికైనా మనం ఈ ప్రశ్నల్ని వేసుకోవాలి.

విద్య, ఆరోగ్య రంగాలకు ప్రజలలో ఉన్న డిమాండ్ దృష్ట్యా గత కొన్నేళ్లుగా మన పాలకులు వాటి గురించి మాట్లాడుతున్నారు, కొంత కేటాయింపులు చేస్తున్నారు. కానీ వాటిని కూడా కుట్ర పన్నినట్లు తాత్కాలిక తాయిలాల పథకాల్లా అమలు చేస్తున్నారు తప్ప, నాణ్యతను పట్టించుకోవటం లేదు. అన్నీ ఉన్నా కేవలం రాజకీయ, పాలనా వైఫల్యాల వల్ల ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే కొనసాగుతున్న భారత్‌లాంటి దేశంలో వనరులు ఏమాత్రం వృధా కాకుండా మెరుగైన ఫలితాలను సాధించే దిశగా కొన్నేళ్లుగా అభిజిత్ బృందం చేస్తున్న సూక్ష్మస్థాయి ఆచరణాత్మక సూచనల్ని కూడా మన పాలకులు పట్టించుకున్న దాఖలాలు తక్కువ. ఇటీవల వీటి పట్ల సానుకూలంగా స్పందించిన కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా జానెడు, బెత్తెడు చొప్పున తప్ప ఆచరణసాధ్యమైనా పూర్తిస్థాయి మార్పుల్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నించటం లేదు. ఈ మౌలిక వైఫల్యాన్ని వేగంగా సరిది ద్దుకోవటమే ఇప్పుడు భారతదేశం మొట్టమొదల చేయాల్సిన పని.

**ఇక అభిజిత్ బృందపు ప్రత్యక్ష పరిశీలన పద్ధతికి సంబంధించి!**

ప్రజల అభిప్రాయాలు, వారి ప్రత్యక్ష భాగస్వామ్యానికి సంబంధించి ప్రపంచ దేశాల అనుభవాలతోపాటు, మన దేశ చరిత్ర, సంస్కృతిలో కూడా నిరూపిత ఉదాహరణలున్నాయి. అధికారాన్ని సాధ్యమైనంతగా ప్రజలకు దగ్గరగా, ప్రజల చేతుల్లో ఉంచేలా స్థానిక స్వయంపాలన ఉండాలని అవన్నీ చెబుతున్నాయి. దీనివల్ల.. అభిజిత్ పరిశీలనలో తేలినట్లు, ఒక ప్రాంతంలో, ఒక బృందంలో ప్రజలు ఏం కోరుకుంటున్నారో వారికి నచ్చినట్లు అదే చేసుకోగలుగుతారు. వాస్తవాలను, గణాంకాలను, తర్కాన్ని, అనుభవాల పాఠాలను విస్మరించి కేవలం భావోద్వేగాలతో, సహజాతాలతో బాధ్యతారహితంగా వ్యవహరిస్తే వారే నష్టపోతారు. తప్పులు ఎక్కువగా వారి కళ్ల ముందే, వారి ప్రమేయంతోనే జరుగుతాయి కాబట్టి.. ఆ తర్వాత వాళ్లే వాటిని దిద్దుకోగలుగుతారు. పడుతూ లేస్తూ నడక నేర్చుకున్న పిల్లల్లా ఎదగగలుగుతారు. ఒకరకంగా చెప్పాలంటే, ఎవరి మనసులో ఎలాంటి ఆలోచనలు పుడతాయో తెలుసుకోవటం, ఆ రకంగా ప్రజల ఇష్టాయిష్టాలను, వాటి వైవిధ్యాల్ని నియంత్రించటం సాధ్యం కాదు కాబట్టి.. వారి ఆలోచనలు సరైన రీతిలో ఉండే పరిస్థితులను, ప్రోత్సాహకాలను పాలనా పద్ధతుల ద్వారా కల్పించటమన్నమాట. మానవ నైజాన్ని, తద్వారా వ్యక్తిని చిన్నచూపు చూసే కమ్యూనిజం, కేంద్రీకృత ప్రజాస్వామ్యాల వైఫల్యాలను ఆ చట్రాలలోపలే వీలున్నంత సరిచేసే ప్రయత్నంగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో అద్భుత ఫలితాలనిచ్చిన ఆర్‌సీటీలు, మరికొన్ని చోట్ల విఫలమవటం కూడా.. సామాజిక ఒడంబడికలో భాగంగా ఏర్పాటు చేసుకున్న రాజ్యవ్యవస్థల నిర్మాణంలో స్థానిక ప్రత్యేకతలు, మానవ ప్రవర్తన, మనస్తత్వాల ప్రాధాన్యతకు, వాటిపై పరిస్థితుల ప్రభావానికి, భిన్న ప్రోత్సాహకాల ఆవశ్యకతకు అద్దం పడుతుంది. 'మంచిని ప్రోత్సహిస్తూ, చెడును నిరుత్సాహపరచటమే ప్రభుత్వం చేయాల్సిన

అసలైన పని' అని గ్లాడ్‌స్టోన్ చెప్పిన మాటల్ని ఆచరణలోకి తెచ్చేందుకు ఈ రకమైన కృషి ప్రభుత్వ విధానాల్లో భాగం కావాల్సిందే.

ఏ విధానమైనా సక్రమంగా అమలవ్వాలంటే దానికి సంబంధించిన వారందరూ అందులో భాగస్వాములవ్వాలన్నదే ఇక్కడ సూత్రం. కేంద్రీకృత పాలనలోలా స్థానిక స్వయంపాలనలో నష్టాలు మిగిలిన ప్రాంతాల్లోవారిని నష్టపరిచే ప్రమాదం కూడా ఉండదు. నష్టాలు స్థానిక ప్రాంతానికే పరిమితమవుతాయి, లాభాల అనుభవాల నుంచి మాత్రం ఇతర చోట్ల ప్రజలు కూడా నేర్చుకుని లబ్ధి పొందగలుగుతారు.

పేదలలో తమ జీవితాలను చక్కదిద్దుకునే శక్తిసామర్థ్యాలు దాగి ఉన్నాయని, వారితో మాట్లాడటం ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని అభిజిత్ పేర్కొన్నారు. లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఐఏఎస్ అధికారిగా ప్రకాశం జిల్లాలో, హైదరాబాద్ సహా మరికొన్ని చోట్ల సాగునీరు, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో సాధించిన అద్భుత విజయాలకు కూడా ఇలా ప్రజల భాగస్వామ్యమే, 'జనం చేతికి జవాబుదారీతనంతో అధికారమివ్వటమే' ప్రధాన కారణం. ఇంత ప్రాధాన్యత గలిగి, రాజ్యాంగానికి పునాదిగా ఫెడరలిజం ఉన్నా కూడా మన దేశంలో ఇప్పటికీ అధికారాన్ని వికేంద్రీకరించలేదు. స్థానిక పాలన పటిష్ఠంగా లేకపోవటం వల్ల.. నాణ్యమైన విద్య, ఆరోగ్యాలకు పునాదులైన పాఠశాల విద్య, ప్రాథమిక ఆరోగ్యం కూడా బాగా దెబ్బతిన్నాయి, కనీస అవసరాలైన తాగునీరు, మురుగు పారుదల సదుపాయాలు వంటివి కూడా కరువయ్యాయి. ప్రజల అంతర్గత శక్తిని గుర్తించి, జనం చేతికి అధికారం ఇచ్చే రాజకీయ, పాలనా విధానాలను మనం అమలు చేసి ఉంటే, ఇప్పటికే పెద్ద మార్పు భారతదేశంలో సాధ్యమై ఉండేది. కానీ ఇప్పటికీ ఈ నిరూపిత సత్యాన్ని గుర్తించకుండా.. ప్రభువులైన ప్రజల్ని యాచించేవారుగా తయారుచేస్తూ వారికి సేవకులుగా ఉండాల్సిన పాలకులు మన దేశంలో వారి మీద పెత్తనం చేస్తున్నారు.

ప్రభుత్వాలకు-ప్రజలకు మధ్య అంతరాలు లేకుండా పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే.. అధికారాన్ని కేంద్రీకరించకుండా పరిణతి గల ఫెడరల్ వ్యవస్థతో వికేంద్రీకరించాలి. జవాబుదారీతనంతో పటిష్టమైన స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి. జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి.. రాష్ట్రం నుంచి మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలకు నిధులు, అధికారాలు బదిలీ కావాలి. రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తి కావాలి, స్థానిక ప్రభుత్వాల మీద రాష్ట్రాల పెత్తనం పోవాలి. ప్రజల అభిప్రాయాలు, భాగస్వామ్యంతో పనిలేకుండా పాలన సాగటానికి రాజకీయ నాయకులతో కుమ్మక్కయి వ్యవహరిస్తున్న ప్రభుత్వాధికారులు కూడా కారణం. వీరు బ్రిటీష్ కాలం నాటి పద్ధతుల్లో ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తూ, లంచాలు, వేధింపులతో వారిని భయపెడుతూ, అవమానిస్తూ ప్రజల పన్నుల డబ్బు, ప్రభుత్వ పథకాలు విఫలమవటంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ప్రజల సేవాకేంద్రాలుగా మార్చటానికి 'హక్కుగా పౌర సేవల' చట్టం వంటి సంస్కరణలతో అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చేయాలి.

**తర్వాతి అంశం- ప్రజల పన్నుల డబ్బును ఖర్చు చేసే తీరు!**

మన దేశంలో ప్రభుత్వంలో ఉన్నవారు, ప్రజల డబ్బు మీద విలాసవంతమైన జీవితాల్ని గడుపుతూ, ప్రజల పేరుతో అమలు చేస్తున్న పథకాలకు తమ సొంత డబ్బేదో ఇస్తున్నట్లు ప్రగల్భాలు పలుకుతున్నారు. 'మీరు రూపాయి కడితే చాలు, మిగతాది మేమే కడతాం', 'ఇన్ని వేల కోట్ల వరాల్ని ప్రకటించింది మేం కాదా?' వంటి డైలాగులతో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏమాత్రం సిగ్గుపడకుండా బహిరంగంగానే రాచరికాన్ని ప్రదర్శిస్తున్నారు. అభిజిత్ బృందం చేసిన కృషిలో 'తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలను సాధించటం' ఒక ముఖ్యమైన అంశం. పాలన అంటే.. ఇలా పరిమిత వనరులతో అపరిమిత అవసరాలను తీర్చడమే! కానీ అపరిమిత వనరులున్నట్లు ప్రజలను భ్రమపెడుతూ తాత్కాలిక తాయిలాలను ప్రకటిస్తూ ఓట్లు దండుకుంటున్నారు మన నేతలు. తనది కాకపోతే దేకుతూ వెళ్లమన్నట్లు, ప్రజల అవిద్యను, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని వారి పన్నుల డబ్బును ఇష్టమొచ్చినట్లు వృథా చేస్తున్నారు. తెలంగాణలో భారీ ఎత్తిపోతల నిర్మాణం, ఏపీలో రెండువేల మందికో గ్రామ సచివాలయం, ఆర్టీసీ విలీనం వంటివి అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే పాలనకు కొన్ని ఉదాహరణలు.

అసంబద్ధ పథకాలతోనే కాదు, వాటి అమలులో కూడా భారీగా ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు, దోచేస్తున్నారు. ఆర్‌సీటీలు వంటి పద్ధతుల్ని తమ వ్యాపార, ఎన్నికల అవసరాలకు వాడుకుంటున్న నాయకులు పాలనలో మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ జనహితాన్ని, రాజ్యాంగం మీద చేసిన ప్రమాణాల్ని తుంగలో తొక్కుతున్నారు. పాలన ఎక్కువగా రాష్ట్రాల పరిధిలోనే ఉంటుంది కాబట్టి.. ప్రజాధనం సద్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వాలు మరింత జాగ్రత్తను ప్రదర్శించాల్సుంది. ఆర్థిక పరిస్థితులు క్షీణించిన ప్రస్తుత తరుణంలో అభిజిత్ సూక్ష్మస్థాయి జాగ్రత్తలకు మరింత ప్రాధాన్యత ఉంది.

నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక స్వయంపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు, ప్రజల పన్నుల డబ్బును సద్వినియోగం చేయటం.. ఇవీ పేదరికాన్ని నిర్మూలించటంలో కీలక పాత్ర పోషించేవి. చట్టబద్ధపాలన వంటి ఇంకొన్నింటిని కూడా ఈ జాబితాకు జోడించవచ్చు. ఇవి లేకుండా తాత్కాలిక తాయిలాల్లా పథకాలను రూపొందించి, వాటికి పేదరిక నిర్మూలనా పథకాలు అని పేరుపెడితే.. ఆర్థిక సంక్షోభం పెరిగి, యువభారతం కాస్తా యువభారాన్ని మోసే దేశంగా తయారవుతుంది తప్ప పేదరికం ఎట్లా పోతుంది?

ఇక చివరిది, బహిరంగ చర్చా ప్రమాణాలు! విధానాల మీద చర్చించేటప్పుడు, నిర్ణయించేటప్పుడు వాస్తవాలు, తర్కం, హేతుబద్ధత, సాక్ష్యాలు, సమన్వయము కీలకం. ఇవి లేకుండా, కార్యకారణ సంబంధం లేకుండా మన రాజకీయ, పాలనా చర్చలు జరుగుతుండటం, ఈ ధోరణినే ఎక్కువశాతం మీడియా కూడా పెంచిపోషిస్తుండటం వల్ల మనం ఒక దేశంగా, సమాజంగా కూడా తీవ్రంగా నష్టపోతున్నాం. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్)ను నరేంద్ర మోదీ ప్రభుత్వం లక్ష్యశుద్ధి లేకుండా, అసమర్థంగా, ప్రజావ్యతిరేకంగా అమలు చేసినా ప్రధాన ప్రతిపక్షాలు సరైన ప్రశ్నల్ని లేవనెత్తలేకపోయాయి, ప్రయోజనకరమైన జీఎస్టీని అప్రయోజనకర రీతిలో అమలు చేస్తున్నా వైఫల్యాన్ని విమర్శించలేకపోయాయి. మన పొరుగున ఉన్న చైనా మనకంటే ఆర్థికంగా, తలసరి ఆదాయం పరంగా, సైనిక పరంగా ఎన్నో రెట్లు బలంగా ఉన్నా.. మనకున్న ప్రజాస్వామిక శక్తి వారిని వణికించగల బలం. కానీ చైనా పాటి వికేంద్రీకరణను కూడా చేయకుండా, విద్య, ఆరోగ్యం, శాస్త్ర సాంకేతికత, మౌలిక వసతుల కల్పనలో చైనా నుంచి నేర్చుకోకుండా మన ప్రజాస్వామ్యాన్ని మనమే బలహీనం చేసుకుంటున్న వైనాన్ని గుర్తించటం, ప్రశ్నించుకోవటం, పాలకుల్ని నిలదీయటం ఇప్పటికీ మనకు చేతకావటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పసలేని, అవినీతి నిండిన అరాచకంకన్నా, ఎంతోకొంత పద్ధతిగా, నిజాయతీగా ఉన్న నియంతృత్వమే మేలన్న భావన ప్రజలలో కలిగితే వారిని తప్పు పట్టగలమా? మన విధానాల రూపకల్పనలో హేతుబద్ధ బహిరంగ చర్చా ప్రమాణాలు కొరవడటం వల్లే పేదరికాన్ని నిర్మూలించుకోలేక ప్రపంచంలో ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే కొనసాగుతున్నాం. అభిజిత్ బృందం స్పష్టమైన ఫలితాలను సాధించటానికి విషయాలు, విధానాల నిగ్గుకు అనుసరించిన పై ప్రమాణాలు ఎంతో ఉపయోగపడ్డాయి. మనం స్థూల స్థాయిలోనూ, సూక్ష్మ స్థాయిలోనూ ఈ ప్రమాణాలను పెద్దగా పట్టించుకోకపోవటం వల్ల.. అటు విధానాల పరంగానూ, ఇటు ఉన్న పథకాల అమలులోనూ కూడా తీవ్రంగా నష్టపోతున్నాం.

**అధికార మార్పిడి మీదే విపక్షాల దృష్టి**

పేదరికాన్ని కొనసాగిస్తున్న ప్రభుత్వాల పట్ల ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతున్నా ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు కూడా నిజమైన మార్పు వైపు మొగ్గు చూపటం లేదు. కొత్తసీసాలో పాతసారా చందంగా కొత్త తాత్కాలిక తాయిలాల్ని, భావోద్వేగాల్ని సృష్టిస్తూ అధికార మార్పిడికి, చిన్న చిన్న మార్పులకు రాజకీయ పార్టీలు పరిమితమవుతున్నాయి, ప్రజలను మభ్యపెడుతున్నాయి, ప్రజాస్వామ్యాన్ని ఓటింగ్, షౌటింగ్‌ల స్థాయిలో కొనసాగి స్తున్నాయి. దీంతో పేదరిక నిర్మూలన భారతదేశంలో నిరంతర ఓటు బ్యాంకు రాజకీయంగా, అధికార క్రీడగా కొనసాగుతోంది.

**ఎందరో ఉన్నారు**

అభిజిత్ ఒక విషయాన్ని వినమ్రంగా చెప్పారు. "నాలాంటి వాళ్లు కొన్నిసార్లు మాటసాయం చేస్తుంటారు. కానీ పేదరిక నిర్మూలనకు నిజంగా కృషి చేస్తున్నవారు ఎందరో ఉన్నారు" అన్నారు. పేదరిక నిర్మూలనకు భారత్‌లో రంగాలు, అంశాలవారీగా కొన్ని పౌర సంస్థలు, పలువురు పౌరులు కూడా తమ వంతు కృషిని ప్రభావశీలంగా చేస్తున్నారు. ముంబయిలో అభిజిత్ దంపతులతో కలిసి పనిచేసిన 'ప్రథమ్' సంస్థ విద్యారంగంలో ప్రామాణికంగా పనిచేస్తోంది. పాఠశాల విద్యా ప్రమాణాలపై పుష్కరకాలానికి పైగా 'అసర్' పేరుతో నివేదికల్ని విడుదల చేస్తోంది. ఆయా రంగాల్లో ఇలా సేవలందిస్తున్న వ్యక్తుల్లో తగినంత గుర్తింపు లేనివారు కూడా ఉన్నారు. కొన్ని రంగాలకే పరిమితం కాకుండా.. అన్ని రంగాలనూ ప్రభావితం చేయగల రాజకీయ, పాలనా సంస్కరణల కోసం రాజకీయ ఉద్యమంగా, పార్టీగా లోక్‌సత్తా బహుముఖ కృషి చేస్తూ వస్తోంది. ఇందుకోసం వామపక్ష, వామపక్షేతర, ఉదారవాద అని తేడా లేకుండా కలిసి వచ్చే ప్రజాస్వామిక శక్తులన్నిటితో రంగాలు, అంశాలు, కార్యక్రమాలవారీగా పనిచేస్తోంది. విద్యా ప్రమాణాలపై 'అసర్' నివేదికను రూపొందించే 'ప్రథమ్' సంస్థతో లోక్‌సత్తా ఎన్నో సంవత్సరాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిసి పనిచేస్తోంది. అసర్ తొలి నివేదికను ఆ సంస్థ వ్యవస్థాపకునితో కలిసి లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ విడుదల చేసి ప్రోత్స హించారు. మనం పదవుల్ని, పురస్కారాల్ని ఎక్కువ గౌరవిస్తాం కాబట్టి కనీసం నోబెల్ బహుమతి పేరుతో మరోసారి (గతంలో అమర్త్యసేన్‌కు నోబెల్ వచ్చినప్పుడు ఆయన స్థూల స్థాయిలో ప్రతిపాదించిన విద్య, ఆరోగ్యం, మానవ వనరుల అభివృద్ధి విధా నాలపై కొంత చర్చ జరిగింది) చర్చకు అవకాశం వచ్చినందుకైనా మనం ఈ అంశాలన్నిటిపై ఆలోచన చేయాలి. వేలెడు, జానెడు, బెత్తెడు లెక్కల్లో కాకుండా.. మనకున్న సామర్థ్యానికి తగ్గ వృద్ధిని సాధించేందుకు పై ఎజెండాను అమలు చేసేందుకు, అమలు చేయించుకునేందుకు క్రియాశీల సంకల్పం తీసుకోవాలి.

వాస్తవానికి ఈ ఎజెండాలో ఉన్నవన్నీ ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు చేయాల్సిన పనులు. ప్రభుత్వాలు ఏ పనులు చేయాలో మనం స్పష్టత తెచ్చుకుని డిమాండ్ చేయటం మొదలుపెడితే మార్పు దానంతటదే మొదలవుతుంది. భారతదేశంలో మూలాలుండి, పలు దేశాల్లో సాధికారికంగా నిరూపితమైన ఈ స్థూల/వ్యవస్థీకృత మార్పుల్ని మన దేశంలో ప్రవేశపెడితే సూక్ష్మ స్థాయిలో ప్రజల స్పందనలు కూడా పరిణతి స్థాయిని సంతరించుకునే అవకాశముంది. అప్పుడు అభిజిత్ బృందం ప్రయోగాత్మక కృషి మరింత పదునెక్కి ప్రతి చోటా సంస్కృతిలో, రోజువారీ జీవనంలో భాగమైపోతుంది. ఇంతకుమించిన అభినందన ఆ నోబెల్ విజేతలకు, ఇంతకు మించిన గ్యారంటీ ఈ దేశ ప్రజాస్వామ్యానికి ఏముంటుంది!

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com ఫోన్.నెం: 9866416798

## రాజకీయ పార్టీ-కార్యకర్తలు కావలెను!

స్వచ్ఛరాజకీయానికి తొలిమెట్టుగా ప్రారంభమైన జుగాడ్ భాగస్వామ్య ఓటర్ల ఉద్యమం తొలి వార్షికోత్సవం సందర్భంగా, 2019 మే నెల జనబలంలో 2 లేక 5 లేక 10 వేలు విరాళమిచ్చిన ఇరవైయ్యొక్క మంది (21) జుగాడ్ ఓటర్లను ప్రకటించి, స్వయంగా నేనొక 10 వేలు విరాళమిచ్చిన కార్యకర్తగా మీముందుకు వచ్చి, జుగాడ్ ఆలోచనా విధానంతో ఒక స్వచ్ఛమైన ప్రత్యామ్నాయ జాతీయ పొలిటికల్ పార్టీని శాంతియుత మార్గంలో, అతిసామాన్యమైన ఒకచిన్న ఆర్థికవిప్లవం ద్వారా సమిష్టిగా ఎలా నిర్మించుకో వచ్చునో ప్రతిపాదించడమైంది. తరువాత 2019 జూన్ నెల జనబలంలో కార్యకర్తలు కావలెను అని ప్రకటించడమైంది.

దాదాపు 18 సంవత్సరాల క్రితం తాను స్థాపించిన ప్రజాస్వామ్య పీఠం ద్వారా ప్రచురించిన "మన ప్రజాస్వామ్యం" అనే గ్రంథంలోని భాగాలను సందర్భోచితంగా స్వేచ్ఛగా ఉదహరించుకోవచ్చని లోక్‌సత్తా ఉద్యమసంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ గారు ఇచ్చిన అవకాశాన్ని పురస్కరించుకుని, ఆయన అప్పుడు ప్రస్తావించిన కొన్ని విషయాలు భారతదేశ పౌరులందరూ ఇప్పుడు మరొకసారి మననం చేసుకోవాలి. క్లుప్తంగా ఆయనేమన్నారంటే,

.."రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన సంస్థలు. పార్టీలు ప్రజల్ని సమీకరిస్తాయి. కొన్నికార్యక్రమాల్నీ, నినాదాల్నీ చేపడతాయి. అన్ని వర్గాలవారి అవసరాల్నీ గుర్తించి, వాటిని కలుపుతాయి. ప్రజల మద్దతుతో అధికారాన్ని చేపడతాయి. జాతి గమ్యాన్ని నిర్దేశిస్తాయి. పాలనాబాధ్యతలను చేపట్టి తాము అధికారంలో ఉన్నంతకాలం తాము తలపెట్టిన కార్యక్రమాలను అమలు చేస్తాయి. అయితే, మన వ్యవస్థలో పార్టీల నిర్వహణ గురించి కానీ వాటి అంతర్గత నిర్మాణం గురించి కానీ ఎలాంటి చట్టపరమైన నిబంధనలు లేవు. కొన్ని పార్టీలు ప్రజాస్వామికంగా ప్రారంభమైనా, కాలక్రమేణా ఎవరికీ జవాబుదారీ కాకుండా, సభ్యుల అభీష్టం మేరకు ఎన్నికైన నాయకునికి పార్టీ అధికారం అప్పచెప్పకుండా, బలవంతంగానో, ధనబలంతోనో, కండబలంతోనో, లేదా స్థానబలంతోనో ఎవడైనా నాయకుడిగా ప్రకటించుకుంటే అధికారం అతని హస్తగతమౌతోంది అప్రజాస్వామికంగా ఆవిధంగా నడిచే పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడలేవు. నిరంకుశంగా వ్యక్తుల ఇష్టానుసారంగా నడిచే పార్టీలలో ఏపార్టీ గెలిచినా ఓడిపోయేది ప్రజలే. కాబట్టీ పార్టీలనూ, రాజకీయాలనూ చట్టబద్ధంగా ప్రజాస్వామికీకరణం చేయడం అతిముఖ్యమైన అంశం".. ఆయన అన్న మాటలు శిలాశాసనం లాగ నేటికీ వర్తిస్తాయి.

అందుకే, "నభూతో నభవిష్యతి" అన్న తరహాలో వినూత్న రాజకీయాన్ని అందించడం కోసం జుగాడ్ ఓటర్ల ఉద్యమం సంకల్పించింది. జాతీయ "జుగాడ్ పార్టీ" (తాత్కాలికనామం) ఎలాఉండాలో కార్యకర్తలే సమిష్టిగా నిర్ణయిస్తారు. భావజాలాల ముసుగులో నిరంకుశ పాలన జరగదు. తప్పులు జరిగితే వెంటనే సరిదిద్దుకుంటారు. ఏర్పడబోయే ప్రభుత్వమూ, ప్రభుత్వ అనుబంధ వ్యవస్థలూ వాటిలోపనిచేసే ఉద్యోగస్తులూ ఎంత నిజాయితీగా పారదర్శకంగా ఉండాలో జుగాడ్ పార్టీయొక్క కార్యకర్తల ఆర్థిక పరమైన రాబడి-ఖర్చులకు సంబంధించిన విషయాలలో కార్యకర్తల యొక్క ,వ్యవహార శైలితోనే ప్రజలందరికీ తెలిసిపోతుంది.



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

సూక్ష్మంగా ఆచరణయోగ్యమైన ఎజెండా తయారవుతుంది. ఆర్థికంగా పార్టీకి లోటుండదు. ఎందుకంటే ప్రతీ ఓటరూ, ప్రతీ కార్యకర్తా తమ జీవితంలో ఒకేఒక్కసారి చెక్కు రూపేణా శాశ్వత విరాళంగా ఇచ్చి నిధిసేకరణ చేసుకుంటారు. ఈ ఉద్యమం ప్రస్తుతం ఉభయ తెలుగురాష్ట్రాలలోని 294 ఎమ్మెల్యే నియోజక వర్గాలకూ (119+175) వర్తిస్తుంది. ప్రతీ ఎమ్మెల్యే స్థానం నుండీ కనీసం ఒక కార్యకర్త కావాలి. మొదట వచ్చిన వారికి మొదటి స్థానం ప్రాతిపదికన ఆయా కార్యకర్తలకు ఆయా నియోజకవర్గ ఇంఛార్జిగా బాధ్యతలు అప్పగించడం జరుగుతుంది. సగం మంది స్త్రీలూ సగం మంది పురుషులూ ఉండాలి. వయసు 20-50 సంవత్సరాల మధ్యనుంటే జూనియర్ కార్యకర్తగానూ, 50-80 సంవత్సరాల మధ్యనుంటే సీనియర్ కార్యకర్తగానూ వ్యవహరిద్దాము.

జుగాడ్ ఓటర్ గా నమోదు అవాలని అనుకున్న విరాళదాత వివాహమైన వ్యక్తి అయితే, ఒకేవిరాళంతో ఆ దంపతులను ఇద్దరినీ జుగాడ్ ఓటర్లగా స్వీకరించడం జరుగుతుంది. అనగా ఇప్పటిదాకా షుమారు 42 మంది మనఉద్యమానికి మద్దతు తెలిపారనుకోవాలి. వ్యక్తియొక్క ఓటుహక్కు వ్యక్తిదే. వ్యక్తియొక్క ఆత్మగౌరవం వ్యక్తిదే. వ్యక్తియొక్క కులం అయినా వ్యక్తియొక్క మతం అయినా, వ్యక్తియొక్క పుట్టిన రాష్ట్రమైనా ఆ వ్యక్తికే పరిమితం. జుగాడ్ ఓటర్లు భారతదేశంలో ఎక్కడైనా స్వేచ్ఛాజీవులే. వారు తమకు నచ్చిన పార్టీకి ఓటు వేసుకోవచ్చు. మీకు ఎన్నికల కమిషన్ ద్వారా వచ్చిన ఓటర్ గుర్తింపు కార్డు ఉంటే చాలు. మీరు కార్మికులైనా, కర్షకులైనా, సినీప్రముఖులైనా, ప్రభుత్వోద్యోగులైనా, జర్నలిస్టులైనా, విద్యార్థులైనా ఎవరైనా పరవా లేదు. ఆబాలగోపాలం ఈ ఉద్యమంలో భాగస్వామ్యం స్వీకరించవచ్చు. మనమందరమూ కలిస్తేనే చక్కని ప్రజాస్వామ్యం ఏర్పడుతుంది ఇటువంటి విషయాలలో జుగాడ్ పార్టీ ప్రమేయం కానీ వివక్ష కానీ ఉండదు. నేరచరితులపై పార్టీ తీవ్రంగా స్పందిస్తుంది. ఇప్పటివరకూ చెల్లుబాటులో ఉన్న సుప్రీంకోర్టు తీర్పులను పార్టీ గౌరవిస్తుంది.

ప్రతీ ఎమ్మెల్యే నియోజకవర్గానికీ కనీసం ఒక కార్యకర్త స్వల్పమొత్తంలో విరాళసేకరణకు నడుంబిగించి ముందుకు రావాలి. కార్యకర్తకు ఆత్మవిశ్వాసం, పట్టుదల, తమసమీప బంధుమిత్రసముదాయంలో విశ్వసనీయత ఉండితీరాలి. తాను నిజాయితీగా స్వయంసంపాదనపై జీవిస్తూ ఒకేఒక్కసారి పది వేలరూపాయలు జుగాడ్ ఓటర్ల ఉద్యమానికి దానంచేసిన తరువాతనే జుగాడ్ ఓటర్ల నుండి 2 వేలు , లేదా 5 వేలు, లేదా 10 వేలు విరాళం స్వీకరించడానికి, అదికూడా 5 నుంచి 25 మంది తన సమీప బంధుమిత్రులనించి మాత్రమే, అనుమతించడం జరుగుతుంది.

జుగాడ్ ఓటర్లే ప్రభువులు. సాహసించండి. కనీసం మీరు నమ్మిన కార్యకర్తకు 2 వేలరూపాయలు విరాళమివ్వండి. కష్టార్జితమైన మన పన్నులడబ్బు అవినీతి ప్రభుత్వాల ద్వారా పక్కదారి పట్టకుండా కాపాడుకోవాలంటే అవినీతిలేని రాజకీయ పార్టీ కావాలి.

త్వరపడండి !

భావిభారత భాగ్య విధాతలుగా సమాజంలో గుర్తింపు పొందండి!

సంప్రదించండి. : 9866416798

# పాలకులు ఎవరన్నది కాదు..

## ప్రజలు ప్రభువులుగా ఉండటమే సురాజ్యానికి గీటురాయి

ప్రజలు ప్రభువులుగా ఉన్నారా, లేదా? అన్నదే తప్ప.. అధికారంలో తెల్లవాడున్నాడా, నల్లవాడున్నాడా అన్నది స్వరాజ్యానికి గీటురాయి కాదని మహాత్మాగాంధీ ఎప్పుడో 103 ఏళ్ల క్రితమే కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన కొత్తలో, గాంధీ అంటే ఎవరో భారత్‌లో పెద్దగా తెలియని కాలంలో 1916లోనే బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఈ మాటలు చెప్పారని.. ప్రజలు ప్రభువులుగా ఉండే సురాజ్యమే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారన్నారు.

హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలోని ఆంధ్ర మహిళా సభ వ్యవస్థాపక దినోత్సవం, గాంధీజీ 150వ జయంతి సంవత్సరం నాయకురాలుగా మలచారన్నారు. డి.డి నాయకత్వ పాటవానికి 1937లో ఆమె సంస్థాపించిన ఆంధ్ర మహిళా సభ వివిధ రూపాల్లో, శాఖలతో నడుస్తున్న తీరే నిదర్శనమని శ్లాఘించారు. ఆంధ్రులు ఆరంభశూరులు అనే అపప్రథ లేకుండా.. కులం, మతం, ప్రాంతం వంటి సంకుచిత రాజకీయాల ప్రభావం పడకుండా నడుస్తున్న అతి కొద్ది సంస్థల్లో ఆంధ్ర మహిళా సభ ఒకటన్నారు. డి.డి జీవితం.. మహాత్మాగాంధీ నాయకత్వానికి, నాయకత్వ తయారీకి నిదర్శనమని నివాళులర్పించారు.

అనంతరం స్వరాజ్యం నుంచి సురాజ్యంపై ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. గాంధీ ఆశించిన స్వరాజ్యం మనకు ఏ మేరకు వచ్చిందో తెలియాలంటే ఆరు ప్రమాణాలతో పరీక్షించుకోవాలని జేపీ అన్నారు.



సందర్భంగా, 'స్వరాజ్యం నుంచి సురాజ్యం'పై జేపీ మాట్లాడారు.

ఎవరూ ఊహించని, సాధ్యంకాదనుకున్నటువంటి జాతి నిర్మాణాన్ని ఎంతో వైవిధ్యం, ప్రపంచంలో ఎక్కడాలేనన్ని కులాలు, మతాలు, తెగల మధ్య భారత్‌లో గాంధీజీ సాధించి చూపారని.. అదేసమయంలో అనితరసాధ్యమనిపించేలా ఎంతోమందిలోని శక్తిసామర్థ్యాలను వెలికితీసి నాయకులుగా తయారు చేసిన ఘనత కూడా గాంధీజీదని జేపీ అన్నారు. 8 ఏళ్ల వయసులో పెళ్లయిన దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ను జాతీయ

స్వపరిపాలన – ఓటు, స్వేచ్ఛ, సాధికారత, చట్టబద్ధపాలన, స్వయందిద్దుబాటు, భిన్నాభిప్రాయాలను సమన్వయం చేసే నిరంతర సంభాషణ.. అనే ఈ ప్రమాణాల్లో కేవలం మొదటి రెండు మాత్రమే మనకు ఉన్నాయని, మిగిలినవి కాగితం మీద, ఉపన్యాసాల్లోనే ఉన్నాయని జేపీ వివరించారు.

ఓటు, ఇష్టమొచ్చినట్లు అరుపులు, నిరసనలు, గందరగోళానికి స్వేచ్ఛ మాత్రమే మనకున్నాయని జేపీ అన్నారు. ప్రజల సాధికారతను పెంచేలా విధానాలను అమలు చేస్తూ వారి

చేతికి అధికారం ఇవ్వకుండా మన పాలకులు రాచరిక ధోరణులతో పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. చట్టాన్ని బహిరంగంగానే చట్టుబండలు చేస్తున్నారన్నారు. మన దేశంలోని జైళ్లలో దాదాపు 70 శాతం మంది విచారణకు నోచుకోక, కేవలం పేదరికం కారణంగా బెయిలు తెచ్చుకోక జైళ్లలో మగ్గుతున్నారన్నారు. నేరపరిశోధనలో చావగొట్టి ఎవరి చేతో నేరాలు ఒప్పిస్తున్నారు తప్ప.. శిక్ష పడేలా చేస్తున్న అసలు నేరస్తుల సంఖ్య నూటికి పది మాత్రమేనన్నారు. పాలనపరంగా, వ్యక్తులపరంగా తప్పులు జరుగుతుంటాయని, మహాత్మాగాంధీ కూడా తప్పులు చేశారని, కానీ తప్పుల్ని సరిదిద్దటానికి మన వ్యవస్థలో స్వయందిద్దుబాటు ఏర్పాట్లు లేవన్నారు. ప్రజల మధ్య విద్వేషాల్ని రెచ్చగొట్టకుండా, పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సైతం సామరస్యంగా పరిష్కరించేందుకు వీలుగా నిరంతర సంభాషణ స్వతంత్ర భారతదేశంలో కరువైందన్నారు. ఎన్నో కులాలు, మతాలు, తెగలు, ఆచారవ్యవహారాలు ఉన్న దేశంలో ప్రజల మధ్య గాంధీజీ సంభాషణను ప్రవేశపెట్టి అపనమ్మక, విద్వేషవాతావరణాన్ని నియంత్రించారని, ఉత్తర-దక్షిణ, హిందూ-ముస్లిం, సంపన్నులు-పేదలు.. ఇలా భిన్న వర్గాల మధ్య సంభాషణతో సామరస్యాన్ని నిర్మించారని అన్నారు.

ఇలా ఆరింటిలో ఓటింగూ, షూటింగ్ స్వేచ్ఛ తప్ప నాలుగు అంశాల్లో స్వతంత్ర భారతం విఫలమవటం వల్ల.. గాంధీ ఆశించిన సురాజ్యం ఇంకా రాలేదని జేపీ అన్నారు. రహస్య బ్యాలెట్ ఎన్నికల వ్యవస్థలో ఇది మంచి పద్ధతి, అది చెడ్డ పద్ధతి అంటూ ఉండవుగానీ.. స్వరాజ్యానికి ఉండాల్సిన నాలుగు అంశాల్లో మనం విఫలమవటం వల్ల మనం బ్రిటిష్ వారి నుంచి అరువు తెచ్చుకున్న ఎన్నికల వ్యవస్థ (ఎఫ్‌పీటీపీ) కూడా భ్రష్టుపట్టి పోయిందన్నారు. ఎన్నికల్లో పార్టీలు కోట్ల రూపాయల లెక్కచూపని డబ్బుని గుమ్మరించటం, ప్రజలు ఓటును డబ్బు కోసం, తాత్కాలిక పథకాలు, ఇతర ప్రలోభాల కోసం అమ్ముకోవటం పెరిగిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు నుంచి ఈ జాడ్యం ఇప్పుడు ఉత్తర భారతదేశ రాష్ట్రాలకు కూడా పాకిందని ఇటీవలి ఎన్నికల్లో కూడా చూశామన్నారు.

**ఇంత తాత్కాలిక తాయిలాల సంస్కృతి, ప్రజల సాధికారత పట్ల ఇంత నిర్లక్ష్యం ప్రపంచంలో మరే దేశంలోనూ కన్పించదు**

సామాన్యుడికి తన బతుకు మీద తనకు అధికారం ఇవ్వటం, సాధికారత, స్వావలంబన కల్పించటం స్వరాజ్యమని గాంధీజీ చెబితే.. ఉచితాలు, తాయిలాలు, ప్రలోభాలతో అతడ్ని స్వతంత్ర భారతదేశంలో పరాధీనుడిగా పాలకులు తయారుచేశారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సాధికారతను దెబ్బతీసేలా ఇన్ని తాత్కాలిక తాయిలాలు, ఉచితాలు, డబ్బు పంపిణీ చేస్తున్న దేశం ప్రపంచంలో ఎక్కడా లేదని.. ప్రజల సాధికారతను ఇంతగా నిర్లక్ష్యం చేస్తున్న దేశం కూడా ప్రపంచంలో ఎక్కడా కన్పించదని అన్నారు. ప్రజల సాధికారతకు కీలకమైన విద్య, ఆరోగ్యంలో మన ప్రమాణాలు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. 14-18 ఏళ్ల మధ్య విద్యార్థుల్లో సగం మంది గడియారం చూసి సమయం కచ్చితంగా చెప్పలేకపోతున్నారన్నారు. నివారించదగ్గ అంటువ్యాధులు ఇంత పెద్దఎత్తున వ్యాపించటం మన దేశంలో తప్ప ప్రపంచంలో మరే ఆధునిక ప్రజాస్వామిక దేశంలోనూ కనిపించదని డెంగీ జ్వరాలు తాజాగా మన చుట్టూనే రుజువు చేస్తున్నాయన్నారు.

**నాలుగు మౌలిక మార్పుల్ని ప్రజాస్వామ్య నిర్మాణంలో రంగరించాలి**

ఒక దేశం ఎంత గొప్పగా ఉందో తెలుసుకోవాలంటే, అక్కడుండే ఒక కుటుంబం, వ్యక్తి జీవితాల్ని చూస్తే చాలని.. మెజారిటీ ప్రజలు అభద్రతతో, అనారోగ్యాలతో రేపటి గురించి భయపడుతూ బతుకుతుంటే భారతదేశానికి స్వతంత్రం వచ్చింది తప్ప సురాజ్యం వచ్చిందని ఎలా అనుకోగలమని జేపీ ప్రశ్నించారు. దేశంలోని భిన్నత్వాన్ని ఓట్ల కోసం ఒకరి మీద ఒకరిని ఉసి గొల్పేందుకు, విద్వేషాల్ని రెచ్చగొట్టేందుకు అవకాశంగా రాజకీయ నేతలు ఉపయోగించుకుంటున్నారన్నారు. మనకు ప్రజాస్వామ్య శక్తి ఉందని, చరిత్రలో ఆ అనుభవం కూడా ఉందని అన్నారు. కానీ ఆ అనుభవాన్ని ప్రజాస్వామ్య నిర్మాణంలో రంగరించలేకపోయామన్నారు. ఈ నేపథ్యంలో గాంధీజీ 150వ జయంతిని ఆయన కలలుగని జీవితాన్నే అంకితం చేసిన సురాజ్య స్థాపనకు నాలుగు మౌలిక మార్పుల్ని మనం సాధించుకోవాలన్నారు. 1) జవాబుదారీతనం 2) చట్టబద్ధపాలన 3) విద్య, ఆరోగ్యం 4) జనం చేతికి అధికారం.

**ప్రభుత్వోద్యోగుల సమస్య వ్యక్తులపరమైనది కాదు**

మన డబ్బులతో మనం ప్రభుత్వోద్యోగులను పోషిస్తుంటే, వారేమో మనల్ని లెక్కచేయకుండా చిన్నచూపు చూస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారని జేపీ అన్నారు. ఇది వ్యక్తుల పరమైన లోపం కాదని, ఉద్యోగులంటే ఎక్కడో పైనుంచి వచ్చినవారు కాదని, మన ఇళ్లల్లో నుంచి, మన నుంచే వచ్చినవారని అన్నారు. అపరిమిత అధికారాలిస్తే మహాత్ముడు కూడా నియంత అవుతాడని, అందుకే ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు వారు సేవ చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు.

రెండోది, చట్టబద్ధపాలన నేతిబీర కాయలో నేయిలా తయారవకుండా.. చట్టం పేద, ధనిక, కులం, మతం తేడా లేకుండా అందరికీ సమానంగా వర్తించేలా నిర్దిష్ట చర్యలు చేపట్టాలని జేపీ అన్నారు.

మూడోది, ప్రపంచంలో ఎక్కడైనా బతకగలిగే ధీమానిచ్చే ప్రమాణాలతో విద్యను ప్రతి బిడ్డకూ ఆర్థికభారం లేకుండా అందించాలన్నారు. జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా మంచి ఆరోగ్యాన్ని ప్రతి కుటుంబానికీ అందే ఏర్పాటు చేయాలని జేపీ స్పష్టం చేశారు.

**ప్రకాశం పంతులు, రాజాజీ, చిత్తరంజన్‌దాస్, నెహ్రూ, పటేల్, సుభాష్ చంద్రబోస్‌లాంటి యువ నాయకుల్ని తయారుచేసే స్థానిక ప్రభుత్వాలేవీ?**

వీటితోపాటు, పాలనకు కేంద్రం ఢిల్లీలో కాకుండా పౌరులమైన మన చుట్టూ ఉండేలా జనం చేతికి అధికారాన్ని ఇవ్వాలని జేపీ పేర్కొన్నారు. వికేంద్రీకరణతో మన రాజ్యం ఏర్పడాలని, మన జీవితాలు, అవసరాల చుట్టూ రాజ్యం తిరగాలని అన్నారు. ఈ రకమైన స్థానిక స్వయంపాలన లేకపోవటం వల్లే మన దేశంలో ఈవేళ సమర్థ, నిజాయతీ నాయకత్వం కరవైందన్నారు. 1903లో టంగుటూరి ప్రకాశం పంతులు రాజమండ్రికి, 1910వ దశకంలో రాజగోపాలాచారి సేలంకు మునిసిపల్ చైర్మన్లుగా పనిచేశారన్నారు. 1924వ సంవత్సరమైతే స్థానిక ప్రభుత్వాల చరిత్రలో ఓ అద్భుతకాలమన్నారు. చిత్తరంజన్‌దాస్ కలకత్తాకు, నెహ్రూ అలహాబాద్‌కు, వల్లభాయ్ పటేల్ అహ్మదాబాద్‌కు మేయర్లుగా సేవలందించారన్నారు. తనకు నచ్చిన అధికారిని కమిషనర్‌గా నియమించుకుంటానని చిత్తరంజన్‌దాస్ అడిగితే తెల్లవాళ్ల ప్రభుత్వం అంగీకరించిందని, ఆ విధంగా సుభాష్ చంద్రబోస్ కలకత్తా కమిషనర్ అయ్యారని వివరించారు. వలసపాలకులైన బ్రిటిష్ వాళ్లు స్థానిక ప్రభుత్వాలకు అంత ప్రాధాన్యమిచ్చి నాయకత్వం ఎదిగే అవకాశాలనిస్తే.. స్వతంత్ర భారతదేశంలో మనం ప్రజలను పరాధీనుల్ని చేసి సాధికారత లేనివారుగా, చేయిజాచి అర్థించేవారుగా తయారుచేశామన్నారు. 'ప్రజాస్వామ్యానికి పాఠశాలలు స్థానిక ప్రభుత్వాలు' అని విస్మరించారన్నారు.

పౌరులమైన మనం ఇక్కడుంటే కేంద్రం ఢిల్లీలో ఎందుకుంటుంది?

**కేంద్రం మనమా? ఢిల్లీలోని ప్రభుత్వమా?**

కేంద్రం అనే పదాన్ని రుద్దుతూ రాజధానుల చుట్టూ పౌరుల్ని తిప్పుతూ అవమానిస్తున్నారని జేపీ అన్నారు. కేంద్రం అనే భాషే సురాజ్యానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. ఆ భావదారిద్ర్యాన్ని స్కూళ్ల ద్వారా పిల్లల మెదళ్లలోకి కూడా జొప్పిస్తూ సమాజాన్ని, భావితరాల్ని కించపరుస్తున్నారన్నారు. ఇంతగా కేంద్రీకరించిన రాజ్యవ్యవస్థ నియంతృత్వ చైనాలో కూడా లేదన్నారు. పౌరులమైన మనం ఇక్కడుంటే, కేంద్రం ఢిల్లీలో ఎందుకుంటుంది.. కేంద్రం మనమా, ఢిల్లీలోని ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. పౌరులు కేంద్రంగా పాలన ఉండాలి తప్ప ఢిల్లీ, హైదరాబాద్, అమరావతి కేంద్రంగా కాదన్నారు.

ఈ నాలుగు మౌలిక మార్పులు– ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనం, చట్టబద్ధపాలన, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, జనం చేతికి అధికారాలను మనం సాధించుకోగలిగితే, వీటితోపాటు బూజుపట్టిన ఎన్నికల వ్యవస్థను కూడా ప్రక్షాళించుకుంటే అప్పుడు గాంధీ గారు ఆశించిన సురాజ్యం సాధ్యమవుతుందన్నారు. సులభంగా వీటిని సాధించుకునే మార్గాలున్నాయని, కావలసిందల్లా రాజకీయ సంకల్పం మాత్రమేనన్నారు. గాంధీజీ 150వ జయంతి సంవత్సరంలోనైనా ఈ మార్పులకు మనం నడుం బిగించి సురాజ్యానికి గట్టి పునాదులు వేయకపోతే, గాంధీ గారి 175, 200 జయంతులప్పుడు కూడా వీటి మీదే మాట్లాడుకోవాల్సిన దుస్థితిని రాబోయే తరాలకు కల్పించినవారమవుతామన్నారు. ఆ పాపం చేయకుండా స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ వంతు భాగస్వాములు కావాలని జేపీ విజ్ఞప్తి చేశారు.



(జేపీ ప్రసంగం పూర్తి పాఠాన్ని ఆయన ఫేస్‌బుక్ ఖాతా
**www.facebook.com/jploksatta**
లోని వీడియోలో చూడవచ్చు)

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ
మాసపత్రిక

# కాలవాహినిలో పసిడికొండలు

రామచంద్ర గుహ, చరిత్రకారులు

**గాంధీ మరణానంతర ప్రఖ్యాతి, లెనిన్ యశస్సు కంటే శ్రేష్ఠతరమైనదని చెప్పడమే సముచితంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. సాయుధ విప్లవం, వర్గ పోరాటాన్ని ప్రతిపాదించిన రష్యన్ మహానాయకుడి కంటే అహింసా ధర్మం, మత సామరస్యాన్ని ప్రబోధించిన, ఆచరించిన భారతీయ ప్రవక్తనే ఎక్కువగా తమ నైతిక, రాజకీయ మార్గదర్శకుడుగా ప్రపంచ ప్రజలు గౌరవించే అవకాశం 2019లో ఎంతైనా ఉన్నది. ఎందుకంటే 'మానవాళి భావి సహస్ర వర్షాల పురోగమనానికి ఒక ప్రకాశవంతమైన మార్గ నిర్దేశన శిఖరంగా' లెనిన్ కంటే మహాత్ముడినే మానవాళి సంభావిస్తున్నది.**

దౌత్యవేత్త ఇవాన్ మయిస్కీ (1932 నుంచి 1943 వరకు బ్రిటన్‌లో సోవియెట్ యూనియన్ రాయబారి) డైరీలను చదువుతున్నాను. మేధావి, ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగల మయిస్కీకి బ్రిటిష్ సమాజంలో ప్రభావశీలురైన పలువురు ప్రముఖులతో సన్నిహిత స్నేహసంబంధాలు ఉన్నాయి. నాజీ హిట్లర్, కమ్యూనిస్టు స్టాలిన్ కాలం నాటి ఎన్నో చారిత్రక పరిణామాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. మయిస్కీ డైరీలను ఎడిట్ చేసిన ఇజ్రాయిలీ స్కాలర్ గేబ్రియెల్ గారోడెట్ స్కీ సహజంగానే బ్రిటిష్, యూరోపియన్ సంఘటనలు, వ్యక్తులకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. అయితే ఒక భారతీయ రాజకీయవేత్త గురించి ఒక చిన్న, అత్యంత ఆసక్తికరమైన ప్రస్తావన ఉన్నది. కాంగ్రెస్ నుంచి మహాత్మాగాంధీ తాత్కాలిక నిష్క్రమణ గురించి మయిస్కీ 1934 నవంబర్ 4న తన డైరీలో ఇలా రాశారు: 'గాంధీ! 1927లో వియన్నాలో ప్రచురితమైన ఎఫ్.మిల్లర్ పుస్తకం 'లెనిన్ అండ్ గాంధీ' నా వద్ద ఉన్నది. ఈ ఇరువురి గురించి మిల్లర్ ప్రతిభావంతంగా వర్ణించారు. గాంధీ, లెనిన్‌లు మన కాలం సమాన, సమున్నత "శిఖరాలు"గా ఆయన పేర్కొన్నారు. ఈ పోలిక, ఏడు సంవత్సరాల క్రితం అయితే కమ్యూనిస్టులకు, బహుశా మరికొంతమంది యూరోపియన్ బూర్జువా వర్గ ప్రతినిధులకు మాత్రమే అసంబద్ధంగా కన్పించింది. మరి ఇప్పుడో? బూర్జువా మేధావులలో సైతం లెనిన్, గాంధీలను సమస్థాయిలో చూచేందుకు సాహసించేది ఎవరు? నేడు, ఏ మనిషినైనా, చివరకు ఒక శత్రువు కూడా లెనిన్‌ను ఒక చారిత్రక మౌంట్ బ్లాంక్ (యూరోపియన్ ఆల్ప్స్ పర్వతాలలోని అత్యున్నత శిఖరం. ఫ్రాన్స్, ఇటలీ సరిహద్దులో ఉండే ఈ శిఖరం ఎత్తు 15,771 అడుగులు)గా చూడగలడు. మానవాళి భావి సహస్ర సంవత్సరాల పురోగమనానికి లెనిన్ ఒక మహా ప్రకాశవంతమైన మార్గనిర్దేశన శిఖరంగా వెలుగొందుతాడు. ఆయనతో పోల్చితే గాంధీ కేవలం ఒక అట్ట పర్వతం మాత్రమే. ఒక దశాబ్దం పాటు సందిగ్ధ కాంతులతో విరాజిల్లి శీఘ్రగతిన శిథిలమై పోతున్నాడు, మరి కొద్ది సంవత్సరాల అనంతరం చరిత్ర చెత్తబుట్టలోకి విసరివేయబడి విస్మృతుడయిపోయే నాయకుడు గాంధీ'.




మయిస్కీ లెనిన్ సంస్థాపించిన సోవియెట్ యూనియన్ ప్రభుత్వ విధేయ ఉద్యోగి కదా. గాంధీ, లెనిన్‌లపై ప్రస్తావిత వ్యాఖ్య చేయడానికి పదమూడు సంవత్సరాల పూర్వమే ఒక యువ భారతీయుడు గాంధీ కంటే లెనిన్‌కు సమున్నత ప్రాధాన్యమిస్తూ ఒక చిన్న పుస్తకాన్ని వెలువరించాడు. బొంబాయివాసి శ్రీపాద్ అమృత్ డాంగే ఆ యువ భారతీయుడు. ఆయన రాసిన 'గాంధీ వర్సెస్ లెనిన్' 1921లో ప్రచురితమయింది. వ్యక్తిగా మహోన్నతుడైన గాంధీ అభివృద్ధి నిరోధక ఆలోచనాపరుడని డాంగే విమర్శించారు. ఆర్థిక దోపిడీకి కారణమైన వ్యవస్థీకృత మూలాలను గుర్తించి, ప్రజా సమూహాల సమష్టి కార్యాచరణతో ఆ దోపిడీని అంతమొందించేందుకు కృషి చేస్తున్న నాయకుడు లెనిన్ అని డాంగే ప్రశంసించారు. గతాన్ని పునఃసృష్టించేందుకు గాంధీ ఆరాటపడుతుండగా, ఆధునిక నాగరికత సాధించిన మహా విజయాలను సంరక్షించుకొని, కార్మికవర్గం నాయకత్వాన సమాజాన్ని విప్లవాత్మకంగా పునర్నిర్మించు

కోవడం ద్వారా మరింత పురోగతి సాధించేందుకు లెనిన్ సంకల్పించాడని డాంగే పేర్కొన్నారు. ఆ పుస్తకాన్ని రాసేనాటికి డాంగే ఒక్కసారి కూడా రష్యాను సందర్శించలేదు, లెనిన్‌ను ఆయన ఎప్పుడూ చూడలేదన్న విషయాల్ని మనం గుర్తుపెట్టుకోవాలి. అయినప్పటికీ బోల్షివిక్కులు సమసమాజాన్ని, నవ నాగరికతను నిర్మిస్తున్నారనే విశ్వాసాన్ని డాంగే సునిశ్చితంగా వ్యక్తం చేశారు.

డాంగే పుస్తకం వెలువడిన ఆరేళ్ల అనంతరం బ్రిటిష్ పార్లమెంటులో కమ్యూనిస్టు సభ్యుడొకరు గాంధీకి ఒక 'బహిరంగ లేఖ' రాశారు. 'తన చరఖా ఉద్యమం.. మరోపక్క నవీన యంత్ర నాగరికత, శాస్త్ర విజ్ఞానం, భౌతిక పురోగతిపై విమర్శల ద్వారా భారత ప్రజలను, వారి ఆలోచనా పద్ధతులను మహాత్మాగాంధీ తప్పుదోవ పట్టిస్తున్నారని' భారత్‌లో పుట్టి, పెరిగిన షపుర్జీ దొరాబ్జీ సక్లత్ వాలా ఆ లేఖలో ఆరోపించారు. కెమాల్ అటాటర్క్, సన్ యాట్ సెన్, మరీ ముఖ్యంగా లెనిన్‌తో గాంధీని అననుకూలంగా సక్లత్ వాలా పోల్చారు. టర్కీ, చైనా, రష్యా నాయకులు ప్రజల అవ్యక్త భావాలను నిర్భీతితో, స్వేచ్ఛగా వ్యక్తం చేయగా, బానిసల వలే విధేయులుగా ఉండేందుకు భారతీయులను గాంధీ సిద్ధం చేస్తున్నారని' ఆ కమ్యూనిస్టు ఎంపి ధ్వజమెత్తారు. ఆ 'బహిరంగ లేఖ'ను సక్లత్ వాలా 1927లో రాశారు. రెండు సంవత్సరాల అనంతరం సర్దార్ భగత్ సింగ్ రంగంలోకి వచ్చారు. కేంద్ర అసెంబ్లీలో బాంబులు వేసినందుకు అరెస్టయిన భగత్‌సింగ్ ఇలా పేర్కొన్నారు: 'మా చర్య ఆదర్శవాద అహింసా పోరాట పద్ధతులకు భరత వాక్యం పలికింది. ప్రభవిస్తున్న కొత్త తరం అహింసా పోరాటం నిష్ప్రయోజనకరమని విశ్వసిస్తున్నది'. గాంధీ అహింసా బాటను తిరస్కరించి, లెనిన్ హింసాత్మక విప్లవబాట పట్టాలని యువ భారతీయులకు ఆ లాహోర్ విప్లవకారుడు విజ్ఞప్తి చేశాడు. సోవియెట్ దౌత్యవేత్త ఇవాన్ మయిస్కీ వలే 1920-1930 దశకాల భారతీయ కమ్యూనిస్టులు గాంధీని తిరస్కరిస్తూ లెనిన్‌ను ఆరాధించారు. పురాతన, జడప్రాయ భారతీయ సమాజాన్ని ఆధునిక యుగంలోకి పురోగమింప చేయాలంటే మార్మిక మహాత్ముడి కంటే మేధో సంపన్న బోల్షివిక్కే ఆకర్షణీయమైన, ఆమోదయోగ్యమైన మార్గదర్శకుడని వారు విశ్వసించారు. లెనిన్ రష్యా మానవాళికి ఒక విముక్తి మార్గాన్ని చూపిందని సక్లత్ వాలా పేర్కొన్నారు. 'ఆధ్యాత్మిక దృక్పథంతో కాకుండా ఒక నిర్దిష్ట లక్ష్యంతో, ఒక స్పష్టమైన వైఖరితో, పటిష్ఠ పద్ధతులతో మన కార్మికులు, మన రైతులు, మన యువజనులను సంఘటితం చేసేందుకు మాతో కలిసి రావాలని' గాంధీకి సక్లత్ వాలా తన బహిరంగ లేఖలో విజ్ఞప్తి చేశారు. చరిత్ర పరిణామశీలమైనది కదా. లెనిన్ అనంతరం సోవియెట్ యూనియన్‌లో స్టాలిన్ అధికారంలోకి వచ్చారు. కార్మికులను క్రూరంగా శిక్షించాడు. రైతులను అమానుషంగా సంహరించాడు. యువజనులూ సంఖ్యానేకంగా ఆయన క్రౌర్యానికి బలయ్యారు. 1930 దశకం తుదినాళ్లకు సోవియెట్ విప్లవం రాజకీయంగా, ఆర్థికంగా అనర్థదాయకమైనదనే సత్యం నిష్పాక్షిక పరిశీలకులకు అవగతమయింది. అయితే పాశ్చాత్య ఉదారవాదులలో చాలాకాలం వరకు రష్యన్ విప్లవ మహానాయకుని పట్ల ఒక గౌరవ భావం, ఒక సానుకూల వైఖరి వ్యక్తమవుతూనే ఉన్నది. 1972 జనవరిలో లండన్ 'సండే టైమ్స్'లో ప్రముఖ బ్రిటిష్ సాహిత్య విమర్శకుడు సిరిల్ కాన్నొలి రాసిన ఒక వ్యాసం ఇటీవల నా దృష్టికి వచ్చింది. లెనిన్, గాంధీలపై వెలువడిన పుస్తకాలను సమీక్షిస్తూ సిరిల్ ఇలా రాశారు: 'రెండు గొప్ప దేశాలకు కొత్త దిశానిర్దేశం చేయడం ద్వారా ఇరువురూ ప్రపంచాన్ని మార్చారు'. అయితే గాంధీ కంటే లెనిన్ గొప్ప నాయకుడని ఆ బ్రిటిష్ సాహితీవేత్త అభిప్రాయపడ్డారు. బోల్షివిక్ నాయకుడు 53 సంవత్సరాల వయస్సులోనే చనిపోవడం గురించి ఆయన ఇలా వ్యాఖ్యానించారు: 'గాంధీ వలే లెనిన్ కూడా సుదీర్ఘకాలం జీవించి ఉంటే స్టాలిన్ చరిత్రలో ఉండేవాడు కాదు. ఒక హిట్లర్ కూడా ఉండేవాడేనా?' లెనిన్ తన సంకల్ప బలంతోను, తన భావజాల ప్రభావంతోనూ హిట్లర్, నాజీయిజం ప్రభవించకుండా నిరోధించేవాడని సిరిల్ భావించారు. డాంగే వలే సిరిల్ కూడా గాంధీ వ్యక్తిగత సభ్యతా సంస్కారాలను గొప్పగా అభిమానించారు. మహాత్ముని మరణంపై జార్జి ఆర్వెల్ సుప్రసిద్ధ వ్యాఖ్యను ఆయన ఉటంకించారు: 'గాంధీని ఒక రాజకీయవేత్తగా భావించి, ఆయన సమకాలీనులైన ఇతర రాజకీయవేత్తలతో పోల్చితే ఆయన ఎంతటి పరిమళభరితమైన మానవతా సుగంధాన్ని వదిలివెళ్లారో కదా'. అయినప్పటికీ, డాంగే వలే సిరిల్ కూడా లెనిన్ వారసత్వమే ఆధునిక ప్రపంచానికి మరింత ఉపయుక్తమైనదని భావించారు. 'మనమే కనుక కార్మికులమైతే మన సమస్యల పరిష్కారానికి గాంధీ బాట కంటే లెనిన్ పద్ధతులనే మనం ఎంచుకోమూ?' అని ఆయన ప్రశ్నించారు.

మోహన్ దాస్ కరమ్‌చంద్ గాంధీ 1869లో జన్మించారు. ఆరు నెలల అనంతరం వ్లాదిమిర్ ఇల్యీచ్ లెనిన్ మన ధరిత్రికి వచ్చారు. ఇరువురూ సమకాలికులు. సజీవులుగా నడయాడుతున్న కాలంలో ఇరువురి వ్యక్తిత్వాల, నాయకత్వ, భావజాల గొప్పదనాల గురించి తులనాత్మక అధ్యయనాలు వెలువడడానికి ఇదొక కారణం. రెండో కారణం (మరింత ముఖ్యమైనది) ఆ ఇరువురూ మహోన్నత నాగరికతా చరిత్ర గల రెండు అతి పెద్ద దేశాలకు మహా నాయకులు కావడం. వారిరువురూ తమ ప్రజల రాజకీయ అణచివేతను, ఆర్థిక వెనుకబడినతనాన్ని రూపుమాపటానికి కృషి చేసిన మహావ్యక్తులు.

భారతదేశమూ, ప్రపంచ దేశాలూ ఇటీవల గాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని మహాత్ముని స్మరించుకున్నాయి. కొందరు చిత్తశుద్ధితో ఆయనకు నివాళులర్పించారు. మరికొందరు స్వార్థబుద్ధితో సంస్మరించుకున్నారు. గాంధీ జీవితమూ, జీవిత కృషి గురించి సింహావలోకనం జరుగుతోంది. సహేతుకమైన విమర్శలు చర్చకొస్తున్నాయి. మరి లెనిన్ 150వ జయంతిని రష్యా, ప్రపంచ దేశాలూ ఎలా జరుపుకోనున్నాయో అన్నది చాలా ఆసక్తికరమైన అంశం. అయితే మొత్తం మీద మేధావులలోనూ, సామాన్య ప్రజలలోనూ గాంధీ మరణానంతర ప్రఖ్యాతి, లెనిన్ యశస్సు కంటే శ్రేష్ఠతరమైనదని చెప్పడమే సముచితంగా ఉంటుందని నేను భావిస్తున్నాను. సాయుధ విప్లవం, వర్గ పోరాటాన్ని ప్రతిపాదించిన రష్యన్ మహానాయకుడి కంటే అహింసా ధర్మం, మత సామరస్యాన్ని ప్రబోధించిన, ఆచరించిన భారతీయ ప్రవక్తనే ఎక్కువగా తమ నైతిక, రాజకీయ మార్గదర్శకుడుగా ప్రపంచ ప్రజలు గౌరవించే అవకాశం 2019లో ఎంతైనా ఉన్నది. ఎందుకంటే 'మానవాళి భావి సహస్ర వర్షాల పురోగమనానికి ఒక ప్రకాశవంతమైన మార్గ నిర్దేశన శిఖరంగా' లెనిన్ కంటే మహాత్ముడినే మానవాళి సంభావిస్తున్నది.


**(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

# దళిత పరిశోధక విద్యార్థులపై వివక్ష

డాక్టర్ చింతకింది కాశీం, అసోసియేట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం

**ఎన్ఏసీ సభ్యులుగా అరుణారాయ్, ప్రొఫెసర్ స్వామినాథన్, లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ మొదలైన ప్రజాస్వామిక, ఉదారవాదులు ఉండటం వలన కొన్ని అయినా ప్రజలకు మేలు చేసే అంశాలు ఆచరణ లోకి వచ్చాయి. వాటిలో ఒకటి రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్.**

**ఆర్‌జీఎన్ఎఫ్ వలన ఈ పదిహేనేళ్లలో కనీసం 30,000 ఎస్.సి కుటుంబాలు, పది వేల ఎస్.టి కుటుంబాలు, ఇంకో ఇరవై వేల బీసీ, మైనార్టీ కుటుంబాలు బాగుపడ్డాయి. పరిశోధనలు జరగటం మాత్రమే కాకుండా, సూక్ష్మస్థాయిలో కుటుంబాలు కూడా మెరుగయ్యాయి. పరోక్షంగా మరో లక్ష కుటుంబాలు ప్రయోజనం పొందాయి. దేశ ప్రగతిలో వాళ్లు కూడా పాక్షికంగానైనా భాగమయ్యే అవకాశం లభించింది. అట్టడుగు వర్గాలలోని కుటుంబాలు ప్రధాన స్రవంతిలోకి వచ్చారు. ఉపరితలంలోని ఈ సామాజిక మార్పును అంగీకరించలేని వర్గాలకు ఇది నచ్చలేదు.**




దేశవ్యాపితంగా వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేస్తున్న ఎస్.సి, ఎస్.టి పరిశోధక విద్యార్థులకు అందుతున్న రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్స్ (ఆర్‌జీఎన్ఎఫ్)ను కేంద్ర ప్రభుత్వం మూడేళ్లుగా ఎస్.సిలకు నిలిపివేసి, ఎస్.టి విద్యార్థులకు మాత్రమే విడుదల చేస్తున్నది. ఎస్.సి విద్యార్థులకు ఆగిపోవడానికి కారణాలుగా ప్రభుత్వ వర్గాల నుంచి ఏ సమాచారమూ లేదు. ఫలితంగా ఆ వర్గాలకు చెందిన విద్యార్థులలో ఆందోళన మొదలైంది. ఎస్.సి స్కాలర్స్ ఆయా విశ్వవిద్యాలయాలలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగ ఫలాలను సకాలంలో లబ్ధిదారులకు అందించటంలో విఫలమైన పాలకవర్గాలు ఈ నిరసనలను విజ్ఞాపనలుగా గుర్తించి సానుకూల దృష్టితో సమస్యలను పరిష్కరించాలి. అలా కాకుండా రాజకీయ, సామాజిక కోణంలో ఆలోచించి వైరి వర్గాల అలజడిగా పరిగణిస్తే, ఆందోళనలు మరింత ముందుకు వెళ్లవచ్చు.

విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనలకు ప్రపంచ వ్యాపిత గుర్తింపు ఉంటుంది. పరిశోధనల ఫలాలు దేశమంతా అందుతాయి. ఏ దేశంలోనైనా భిన్న సామాజిక సమూహాల ప్రవేశంతోనే పరిశోధన రంగం వికసిస్తుంది. కానీ, భారతదేశంలో కొన్ని సమూహాలు వేల సంవత్సరాలుగా విద్యకు, మేధోరంగానికి దూరం చేయబడ్డాయి. వైదిక వాఙ్మయం పేరిట చలామణి అయిన వ్యవస్థలు మానవ సమానత్వ భావనను అంగీకరించలేదు. అందుకే మన దేశంలో ప్రపంచం గర్వించదగిన ప్రయోగాలు, పరిశోధనలు, ఫలితాలు రాలేదు. మెజార్టీ ప్రజల ఆలోచనలు చాలారోజుల వరకు విద్య ఆవల ఉండిపోయాయి. శాస్త్ర సాంకేతిక రంగమంటే ఒకటి రెండు వర్గాలకే పరిమితమైన స్థితి నేటికీ ఉంది. బహుళ ఆలోచనలకు పరిమితులులేని సమాజంలో పరిశోధనలు జరిగినప్పుడే సమాజ గమనం ముందుకు వెళ్తుంది. బ్రిటిష్ అనంతర భారతదేశంలో దళితులు రాజ్యాంగ వ్యవస్థలు కల్పించిన ఫలితాలను పొందడానికి చాలాకాలం పట్టింది. ప్రభుత్వం, దానికొక నిర్మాణం, తమ మనుగడ కోసం అది కల్పించే అవకాశాలు తెలియని లోకంలో దళితులను ఉంచారు. అంబేద్కర్ సాధించి పెట్టిన హక్కుల స్పృహ కూడా మెజార్టీ దళితులకు 1970 వరకు లేదు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ ఫలాలను అందుకోవాలనే చైతన్యం చాలా ఆలస్యంగా పొందిన దళితులు ఉన్నత విద్యారంగంలోకి 90వ దశకంలో ప్రవేశించారు. అంటే 1950లో రాజ్యాంగం అమలులోకి వస్తే ఈ వర్గాలు విశ్వవిద్యాలయస్థాయి విద్యను అందుకోవడానికి నలభై ఏళ్లు పట్టింది. ఆనాటికైనా శ్రమ జీవితం నుంచి పొందిన జ్ఞానాన్ని జోడించి పరిశోధనలు చేయడానికి దళిత విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటు లేదు. పీజీ స్థాయి విద్యతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త సామాజిక సమూహాలు, వారి ఆలోచనలు పరిశోధనలలోకి ప్రవేశించాలంటే ఆ విద్యార్థులకు ఫెలోషిప్స్

ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉండింది. తగిన పోరాటం లేకపోయినా మేధావి వర్గంలో చర్చ నడిచింది.

2004లో కాంగ్రెస్ పార్టీ యూపీఏ పేరుతో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. ప్రాంతీయ పార్టీలు ఏర్పడటం, బహుజన సమాజ్‌వాది పార్టీ పుట్టటం, అస్తిత్వ ఉద్యమాలు ముందుకు వచ్చి అగ్రకుల పాలకపార్టీల మీద విమర్శ పెట్టడం, మేధావి వర్గంలో విప్లవ శక్తులకు మద్దతు పెరగడం లాంటి అనుకూల పరిస్థితి ఒకవైపు ఉండగా– ప్రజల ప్రయోజనాలను ప్రతిబింబించే అభివృద్ధి నమూనా కాంగ్రెస్ పార్టీ వద్ద లేకపోయింది. పైగా బహుళ జాతి కంపెనీలకు అనుకూలమైన ఆర్థిక విధానాలను రూపొందించింది. స్థూలంగా ఈ అయిదు కారణాల వలన దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రభ తగ్గిపోయింది. ముఖ్యంగా నెహ్రూ కాలం నుంచి ఆ పార్టీకి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న ఎస్.సి, ఎస్.టి వర్గాలు ఆ పార్టీకి దూరం జరగటం మొదలైంది. ఇట్లాంటి వాతావరణంలో 2004లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యూపీఏ అధికారంలోకి వచ్చింది.

దూరమైన ఈ సమూహాలను దగ్గరకు చేసుకొనే నష్టనివారణ చర్యలను కాంగ్రెస్‌లోని కొందరు ప్రజాస్వామికవాదులు పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి సూచించారు. దాని కోసం ఒక కార్యాచరణను రూపొందించాలని కూడా భావించారు. అందులో భాగంగానే 2004 జూన్ 4న సోనియా గాంధీ చైర్మన్‌గా నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్ (ఎన్ఏసీ) ఏర్పాటైంది. నేషనల్ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో భాగంగానే ఎన్ఏసీ ఏర్పడింది. 'మన్మోహన్ సింగ్ మంత్రివర్గం ఉండగా ఎన్ఏసీ పేరిట మరో రాజ్యాంగేతర మంత్రివర్గాన్ని సోనియాగాంధీ రూపొందించుకున్నారని' ఆనాటి ప్రతిపక్షాలు విమర్శించాయి. అయినా, ఎన్ఏసీకి చట్టబద్ధత కల్పించుకొని తాను సంకల్పించిన పనులను చేశారు సోనియా. ఎన్ఏసీ సభ్యులుగా అరుణారాయ్, ప్రొఫెసర్ స్వామినాథన్, లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ మొదలైన ప్రజాస్వామిక, ఉదారవాదులు ఉండటం వలన కొన్ని అయినా ప్రజలకు మేలు చేసే అంశాలు ఆచరణలోకి వచ్చాయి. వాటిలో ఒకటి రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్.

ఉన్నత విద్యలోకి ఇప్పుడిప్పుడే ప్రవేశిస్తున్న ఎస్.సి, ఎస్.టి, బీసీ, ముస్లిం విద్యార్థుల కోసం ఈ ఫెలోషిప్‌ను ప్రవేశపెట్టారు. వేల సంవత్సరాలుగా విద్యకు దూరమైన ఈ సామాజిక సమూహాలకు ఆర్థిక చేయూతనివ్వటం వలన పరిశోధనారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆ కౌన్సిల్ సభ్యులు భావించారు. ఘనీభవించిన పరిశోధన రంగం ద్రవస్థితిలోకి రావటానికి అట్టడుగు వర్గం నుంచి వచ్చిన పరిశోధకులు కృషి చేస్తారని కూడా వాళ్లు ఆశించారు. 'విద్య, పరిశోధనలలోకి కింది వర్గాలను ప్రోత్సహించటం, పరిశోధనలో నాణ్యతను పెంచి జ్ఞాన సమాజం వైపు ప్రయాణించటం' ఆర్‌జీఎన్ఎఫ్ లక్ష్యంగా ప్రకటించారు. దీన్ని 2005–06 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించారు. మొదట్లో ఎస్.సి విద్యార్థులకు మాత్రమే పరిమితం చేసిన ఈ ఫెలోషిప్‌కు పీజీ స్థాయిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేసేవాళ్లు. తర్వాతికాలంలో పీహెచ్‌డీలో చేరిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే నియమాన్ని తీసుకొచ్చారు. దీనిని కొన్నాళ్లకు ఎస్.టి, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కూడా విస్తరించారు.

సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌జీఎన్ఎఫ్ నిర్వహణ ఉండేది. ఎంపిక విధానాన్ని యూజీసీ పర్యవేక్షించేది. ఈ ప్రక్రియ 2017 వరకు నిరాటంకంగా కొనసాగింది. ఇన్నేళ్లలో ఎందరో పరిశోధకులు ఈ ఫెలోషిప్‌ను ఉపయోగించుకొని నాణ్యమైన పరిశోధనలు చేశారు. సమాజాన్ని, రాజకీయార్థిక విధానాలను, ప్రకృతి శాస్త్రాలను కొత్త దృష్టితో విశ్లేషించే పద్ధతి పరిశోధనా రంగంలోకి ప్రవేశించింది. సాహిత్యంలోనైతే బ్రాహ్మణీయ (పుట్టుకను బట్టి మనిషి విలువను నిర్ణయించే నిచ్చెనమెట్ల కులవ్యవస్థ) భావజాలానికి ప్రత్యామ్నాయ ఆలోచనలు పరిశోధనలోకి వచ్చాయి. పరిశోధన పరికరాలు మారిపోయాయి. విశ్లేషణ పద్ధతిలో కూడా మార్పులు వచ్చాయి. ఫెలోషిప్ రావటం వలన పరిశోధకులకు ఆర్థిక వెసులుబాటు లభించింది. అధ్యయనం కోసం పుస్తకాలు సొంతంగా సమకూర్చుకున్నారు. పరిశోధిత అంశానికి సంబంధించి క్షేత్ర పర్యటనలు చేయడానికి గతంలో ఉండిన ఆర్థికలేమిని ఈ కాలం పరిశోధకులు అధిగమించారు. ఉత్పత్తి కులాల నుంచి వచ్చిన వీరు అధ్యయనం, పరిశోధనతోపాటు తమ సామాజిక బాధ్యతగా సామాజిక ఉద్యమాలలో పాల్గొంటూ, నాయకత్వం వహించారు. విశ్వవిద్యాలయాల రాజకీయాలను ప్రభావితం చేశారు.


ఫెలోషిప్ పొందిన పరిశోధకులు తమ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూనే, వైయక్తిక స్థాయిలో కుటుంబ అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు. వేల సంవత్సరాలుగా సంపదకు, సామాజిక హోదాకు, విద్యకు దూరమైన వర్గాల కుటుంబాలకు ఫెలోషిప్‌ల ద్వారా మేలు జరిగింది. సొంత గ్రామాలలో ఉండడానికి ఇళ్లులేక చదువుకునే వాతావరణం ఉండేది కాదు. ఫెలోషిప్ వచ్చాక ఉన్నదాంట్లో కొంత మేరకైనా సొంత ఇళ్లను నిర్మించుకునే అవకాశం ఏర్పడింది. తల్లిదండ్రుల అనారోగ్య సమస్యలకు పరిష్కారంగా మెరుగైన వైద్యం అందించగలిగారు. మధ్యలో ఆగిపోయిన తోబుట్టువుల పెళ్లిళ్లు చేయటమే కాకుండా, తాము కూడా వివాహాలు చేసుకున్నారు. ఈ ఫెలోషిప్‌లు లేకపోతే ఇన్ని వేల కుటుంబాలు సామాజిక సంక్షోభంలో పడిపోయేవి.

ఇట్లా ఆర్‌జీఎన్ఎఫ్ వలన ఈ పదిహేనేళ్లలో కనీసం 30,000 ఎస్.సి కుటుంబాలు, పది వేల ఎస్.టి కుటుంబాలు, ఇంకో ఇరవై వేల బీసీ, మైనార్టీ కుటుంబాలు బాగుపడ్డాయి. పరిశోధనలు జరగటం మాత్రమే కాకుండా, సూక్ష్మస్థాయిలో కుటుంబాలు కూడా మెరుగయ్యాయి. పరోక్షంగా మరో లక్ష కుటుంబాలు ప్రయోజనం పొందాయి. దేశ ప్రగతిలో వాళ్లు కూడా పాక్షికంగానైనా భాగమయ్యే అవకాశం లభించింది. అట్టడుగు వర్గాలలోని కుటుంబాలు ప్రధాన

స్రవంతిలోకి వచ్చారు. ఉపరితలంలోని ఈ సామాజిక మార్పును అంగీకరించలేని వర్గాలకు ఇది నచ్చలేదు. విద్య, సామాజిక ఆవరణలో వచ్చిన చలనం ప్రగతి నిరోధకుల ముందు అనేక ప్రశ్నలను ఉంచింది.

ఆర్‌జీఎన్‌ఎఫ్‌ను క్రమం తప్పకుండా ఈ వర్గాలకు అందించాలనే చిత్తశుద్ధి ఆనాటి కాంగ్రెస్‌కైనా ఈనాటి బీజేపీకైనా ఉంటే కింద చెప్పినట్లు కొన్ని విధాన నిర్ణయాలు జరిగి ఉండేవి. కానీ, జరగనందున ఈ వర్గాల నుంచి చట్టసభలకు ఎన్నికైన ప్రతినిధులు బాధ్యతతో వ్యవహరించాలి. తమ వర్గం ప్రజల హక్కులను కాపాడేందుకు నడుం బిగించాలి.

యూజీసీ సంవత్సరానికి రెండుసార్లు నెట్ పరీక్షను నిర్వహించి మెరిట్ విద్యార్థులకు జేఆర్‌ఎఫ్‌ను ఇస్తుంది. యూజీసీ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ కావడం వలన కేంద్ర బడ్జెట్‌లో దీనికి అధికారికంగా కేటాయింపులు జరుగుతున్నాయి. ఆ డబ్బును ఫెలోషిప్ రూపంలో క్రమంతప్పకుండా ఇస్తున్నారు కాబట్టి ఆర్‌జీఎన్‌ఎఫ్‌ను ఆయా మంత్రిత్వ శాఖల నుండి విడదీసి యూజీసీకి అప్పగించి దానికి కావాల్సిన డబ్బును కేంద్ర బడ్జెట్ నుంచి కేటాయించాలి. ప్రచారం కోసం పాలసీని ప్రవేశపెడుతున్న పాలకులు, వాటి అమలు జరగాలంటే నిధుల కేటాయింపును చిత్తశుద్ధితో చేయాలి. నిధులను నిబద్ధతతో ఆయా వర్గాలకే ఖర్చు చేయాలి. పాలకులు కింది వర్గాల విద్యార్థుల మేలు కోసం నిధుల కేటాయింపులు, విడుదల, ఉపయోగం సరైన పద్ధతిలో చేయరు. ఆ సందర్భంలో రిజర్వేషన్ ఫలాలతో ఎంపికైన ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనార్టీ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం, అధికారుల మీద ఒత్తిడి తీసుకురావాలి. చట్టసభలలో ఈ అలసత్వం మీద మేధోపరమైన చర్చలు చేయాలి. ప్రజాస్వామ్యంలో అంతిమ వేదికైన ప్రజాక్షేత్రం లోకి ఈ ప్రజాప్రతినిధులు వెళ్లాలి. తమ ఓట్లతో ఎన్నికైన ప్రభుత్వా లు తమ పిల్లల విద్య కోసం నిధులు కేటాయించడం లేదనీ, విడు దల చేయటం లేదనీ వారికి అర్థమయ్యేలా చెప్పి చైతన్యం చేయాలి.



## సిద్ధాంతం ఉన్నా పక్షపాతం లేకుండా సమాజ హితం లక్ష్యంగా పనిచేసిన రాఘవాచారి: జేపీ ఘననివాళి

తాను నమ్మిన సిద్ధాంతం పట్ల అంకితభావం ఉన్నా.. పక్షపాత ధోరణులు లేకుండా, సమాజ శ్రేయస్సు లక్ష్యంగా పనిచేసిన విశిష్ట పాత్రికేయుడు, సామాజిక యోధుడు, పౌరుడు చక్రవర్తుల రాఘవాచారి అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళు లర్పించారు. తన అసాధారణ పాండిత్యాన్ని, అపార జ్ఞాన సంపదను, తాత్విక చింతనల్లో తనకున్న పరిజ్ఞానాన్ని, తెలుగు, సంస్కృత, ఆంగ్ల, ఉర్దూ భాషల్లో పట్టును సమాజ హితం కోసం ఆయన రంగరించిన తీరు పెద్ద పాఠమన్నారు. మానవీయ విలువలు మూర్తీభవించిన ఉన్నత వ్యక్తిత్వం ఆయనది అన్నారు. జీవితమంతా అజాత శత్రువుగా తెలుగునాట లక్షలాదిమందికి రాఘవాచారి స్ఫూర్తి ప్రదాత అన్నారు. ఆయన జీవితం పాత్రికేయులకు, దేశానికి మంచి భవిష్యత్తు కోరే వారందరికీ ఆదర్శప్రాయమని చెబుతూ రాఘవాచారి మృతి పట్ల జేపీ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# సమాఖ్యతత్వం ప్రధానం

చంద్రికా సింగ్, స్వతంత్ర పరిశోధకులు
సౌమ్య శ్రీవాస్తవ, పబ్లిక్ ఫైనాన్స్ అనలిస్ట్

**7వ షెడ్యూల్‌లోని అంశాలను పునఃపరిశీలించడం అంటే కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన అధికార విభజనను మార్చడమే. దీనివల్ల కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న అధికార సమతుల్యం కదిలిపోతుంది. కేంద్ర రాష్ట్రాల అధికారాల పునర్విభజనకు సంబంధించి మార్పులు చేయాలని భావించేవారి ఆలోచనలు ఏమిటో గమనించవలసి ఉన్నది. వ్యయాల ప్రాధాన్యాలను మార్చడం కోసమే 7వ షెడ్యూల్‌పై చర్చ జరుపడం మంచిది కాదు. దీనివల్ల రాష్ట్రాల స్వయంసమృద్ధికి ఇప్పుడున్న కొద్దిపాటి అధికారాలు లేకుండా పోతాయి. 7వ షెడ్యూల్ శిలాశాసనం అని, దీనిని మార్చకూడదని భావించడమూ సరికాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కట్టబెట్టడానికి, సమాఖ్య స్వరూపాన్ని మరింత అర్థవంతంగా చేయడానికయితే మార్పులు చేయవచ్చు.**

పద్నాలుగవ ఫైనాన్స్ కమిషన్ గడువు ముగింపునకు వచ్చేకొద్దీ, దేశ సమాఖ్య విత్త విధాన స్వరూపంపై చర్చ పెరుగుతున్నది. రాష్ట్రాలకు పన్నుల బదలాయింపు చేయాలన్న ఫైనాన్స్ కమిషన్ సూచనల పరిస్థితి ఏమిటి? 15వ ఫైనాన్స్ కమిషన్ పరిధిని విస్తృత పరుస్తారా? జీఎస్‌టీ వ్యవస్థ వ్యవస్థ ప్రభావాలు ఎలా ఉంటాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంప్రదాయకంగా ఫైనాన్స్ కమిషన్ పరిధిలో లేని అంశాలపై కూడా చర్చ సాగుతున్నది. ఒకప్పుడు ప్రణాళికా సంఘం పరిధిలో ఉండే అంశాలను కూడా పరిశీలనకు చేపట్టే సంస్థగా ఫైనాన్స్ కమిషన్‌ను భావించేవారు. ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధాని ఆర్థిక సలహామండలి చైర్మన్ బిబేక్ దెబ్రాయ్ ఇటీవల రాసిన వ్యాసాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఈయన అభిప్రాయం ప్రకారం.. సీఎస్ఎస్ (కేంద్రం స్పాన్సర్ చేసే పథకాలు) బాస్కెట్ గడువు పద్నాలుగవ ఫైనాన్స్ కమిషన్‌తో పాటే ముగుస్తుంది. ఈ నేపథ్యంలో కేంద్ర పథకాలను హేతుబద్ధీకరించే, పునర్వ్యవస్థీకరించే అవసరం ఏర్పడ్డది.

ఇది చాలా తీవ్రమైన ఆలోచనా ధోరణి. కేంద్ర పథకాల కింద ఉండే నిధులను తరలించాలనే సూచనలు చేసే అధికారం ఫైనాన్స్ కమిషన్‌కు లేదు. ఈ సంస్థ పరిధిలోకి అవి రావు. సీఎస్ఎస్ పద్నాలుగవ ఆర్థిక సంఘంతోపాటే గడువు తీరిపోతాయని చెప్పడం కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల తరలింపుపై గల తప్పుడు అవగాహనకు నిదర్శనం.

కేంద్రం రెండు రకాలుగా నిధులను బదిలీ చేస్తుంది. ఒకటి సాధారణ అవసరాలకు సంబంధించినవి, రెండవది నిర్దిష్టమైనవి. ఫైనాన్స్ కమిషన్ ఐదేండ్లకు ఒకసారి ఏర్పడుతుంది. ఈ కమిషన్ చేసే సూచనలు సాధారణ అవసరాలకు సంబంధించినవి మాత్రమే. వీటిని ఏ ప్రభుత్వ పథకాలతో ముడిపెట్టి చూడకూడదు. కేంద్ర ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా నిర్దిష్ట అంశాలకు సంబంధించిన కేటాయింపులు చేస్తుంది. ఇందులో సీఎస్–ఎస్‌తోపాటు కేంద్ర పథకాలు (సీఎస్) కూడా ఉంటాయి. ఈ నిధుల బదిలీకి ఏ కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రత్యేక పథకాలతో సంబంధం లేదు. అంటే ఈ పథకాలు ఫైనాన్స్ కమిషన్ పరిధికి బయట ఉండేవి. కేంద్రం ప్రత్యేకించి ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఫైనాన్స్ కమిషన్‌కు అప్పగిస్తే తప్ప కమిషన్‌కు వీటితో సంబంధం లేదు. అందువల్ల పద్నాలుగవ ఫైనాన్స్ కమిషన్ గడువు ముగియగానే ఈ పథకాల కాలం చెల్లుతుందనడం తప్పు. కేంద్ర ప్రభుత్వం ఎంతకాలం అనుకుంటే, అంతకాలం వీటిని కొనసాగించవచ్చు.

బిబేక్ దెబ్రాయ్ తన వ్యాసంలో రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌ను పునఃపరిశీలించాలని కూడా అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య వ్యయాన్ని ఈ షెడ్యూల్ విభజించి చెబుతుంది. ఆరోగ్య రంగానికి కేంద్రం ఖర్చు పెడుతున్నప్పుడు, రక్షణ రంగానికి రాష్ట్రాలు ఎందుకు నిధులు ఇవ్వకూడదని ఈయన ప్రశ్నిస్తున్నారు. ఈ వాదన

చాలా సమస్యలు సృష్టిస్తుంది. ఈ పోలికలు చాలా అసంబద్ధమైనవి. అంతేకాకుండా భిన్నస్థాయిల్లోని ప్రభుత్వాల విధులు ఫెడరల్ వ్యవస్థలో భిన్నంగా ఉంటాయి. ఇందులో రెండు అంశాలున్నాయి. ఒకటి– కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసనాధికారాలను మూడు రకాలుగా విభజించింది. 7వ షెడ్యూల్‌లోని మూడు జాబితాలలో అంశాలవారీగా అధికార విభజనలను చేసింది. కేంద్ర, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా స్పష్టంగా వివరించింది. దీన్నిబట్టి రాష్ట్రాలు కూడా తమ విధుల నిర్వహణకు భారీ వ్యయం అవసరమని చెప్పినట్టయింది. అయితే ఆదాయాన్ని సమీకరించే అధికారం రాష్ట్రాలతో పోలిస్తే కేంద్రానికే ఎక్కువగా ఉన్నాయి. ఈ అసమతౌల్యాన్ని సరిచేసేందుకే భారీగా నిధుల విడుదల రాష్ట్రాలకు చేయవలసి వస్తున్నది. ఇక్కడ మరో అంశాన్ని కూడా గుర్తించాలె. దేశవ్యాప్తంగా రాష్ట్రాల మధ్య అభివృద్ధిలో అంతరాలున్నాయి. విద్య, ఆరోగ్యం, ఉపాధి




మొదలైన అంశాల ప్రాతిపదికగా చూస్తే జీవన నాణ్యతలో ఎంతో తేడా ఉన్నది. తక్కువ ఆదాయం ఉన్న రాష్ట్రాలు ఎంతో వెనుకబడి ఉన్నాయి. వీటికి ఆదాయ మార్గాలు చాలా తక్కువ. ప్రజాసేవలు మొదలైన అంశాలకు సంబంధించిన కేంద్రం కొన్ని నిర్దిష్ట అంశాలకు సంబంధించి నిధులు విడుదల చేయడం తప్పనిసరి. విద్య, ఆరోగ్యం మొదలైన అంశాల్లో కొన్ని రాష్ట్రాలను ఆదుకోవలసి ఉంటుంది.

కేంద్ర నిర్దిష్ట పథకాల కోసం అంటూ నిధులు విడుదల చేయకపోతే ఆయా రంగాలకు నిధులు అందవు. రాష్ట్రాలకు ఆదాయం లేకపోవడం వల్ల కావచ్చు, ప్రాధాన్యాలు గుర్తించకపోవడం వల్ల కూడా కావచ్చు. సీఎస్ఎస్, సీఎస్ పథకాల కోసం వ్యయం చేయడానికి రాష్ట్రాలకు నిధుల కొరత ఉందని డెబ్రాయ్ కూడా తమ వ్యాసంలో ప్రస్తావించారు. కేంద్ర నిధులు లేకపోతే కొన్ని రాష్ట్రాలకు కొన్ని ప్రధాన రంగాలకు కూడా నిధులుండవు. ఒక అంశం మీద శాసనం చేయడానికి, వ్యయం చేసే అధికారానికి సంబంధం ఉంటుంది. కేంద్ర రక్షణ రంగానికి సంబంధించి శాసనం చేసే అధికారం కేంద్రానికి మాత్రమే ఉంటుంది. రాష్ట్రాలకు అధికారం ఉండదు. అందువల్ల కేంద్రమే వ్యయం చేస్తుంది. విదేశీ వ్యవహారాలు, రైల్వేలు, అణు ఇంధనం, ఆదాయం పన్ను, కస్టమ్స్ సుంకాలు మొదలైన అంశాలపై కేంద్రానికి మాత్రమే అధికారాలు ఉంటాయి. రాష్ట్రాల జాబితాలో ఉండే అంశాలు ఎక్కువగా సామాజిక ఆర్థిక సేవలకు సంబంధించినవై ఉంటాయి. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, వ్యవసాయం మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. ప్రజలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ అంశాలు రాష్ట్రాల పరిధిలో ఉంటేనే సమర్థవంతంగా అమలుచేయడం సాధ్యమవుతుంది.

7వ షెడ్యూల్‌లోని అంశాలను పునఃపరిశీలించడం అంటే కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన అధికార విభజనను మార్చడమే. దీనివల్ల కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న అధికార సమతుల్యం కదిలిపోతుంది. కేంద్ర రాష్ట్రాల అధికారాల పునర్విభజనకు సంబంధించి మార్పులు చేయాలని భావించేవారి ఆలోచనలు ఏమిటో గమనించవలసి ఉన్నది. సాధారణ అంశాలకు, నిర్దిష్ట కార్యాకలాపాలకు కేంద్రం రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నది. దీనివల్ల రక్షణ రంగానికి సంబంధించి నిధులు సరిపోవడం లేదనే వాదన ముందుకు తెస్తున్నారు. అయితే కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆదాయవ్యయాలను మార్చవలసి ఉన్నది. ఫైనాన్స్ కమిషన్ సూచనల నేపథ్యంలో రాష్ట్రాలకు భారీగా నిధుల బదలాయింపు జరగవలసి ఉన్నది. అయితే కేంద్ర, రాష్ట్రాల ఆదాయాల పునఃసమీక్ష జరుగవలసి ఉన్నది. జీఎస్టీ అమలు చేసిన తర్వాతి పరిస్థితుల్లో ఇటువంటి సమీక్ష అవసరం ఏర్పడ్డది. అయితే వ్యయాల ప్రాధాన్యాలను మార్చడం కోసమే 7వ షెడ్యూల్‌పై చర్చ జరుపడం మంచిది కాదు. దీనివల్ల రాష్ట్రాల స్వయంసమృద్ధికి ఇప్పుడున్న కొద్దిపాటి అధికారాలు లేకుండా పోతాయి. 7వ షెడ్యూల్ శిలాశాసనం అని, దీనిని మార్చకూడదని భావించడమూ సరికాదు. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కట్టబెట్టడానికి, సమాఖ్య స్వరూపాన్ని మరింత అర్థవంతంగా చేయడానికయితే మార్పులు చేయవచ్చు.

**(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)**

# రైతు సత్యాగ్రహ పాదయాత్రలో మారెడ్డి కృషి మరువలేనిది

ఉపాధ్యాయుడిగా, రైతు నేతగా మారెడ్డి హన్మంతరెడ్డి విశిష్ట సేవలందించారని, వ్యక్తిగా ఆదర్శప్రాయ జీవితాన్ని గడిపారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. రైతులకు ఆదాయం రావటానికి అవరోధంగా వ్యవసాయోత్పత్తులపై ఉన్న ప్రభుత్వ ఆంక్షలను ఎత్తివేయాలని లోక్‌సత్తా ఆధ్వర్యంలో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య చేపట్టిన రైతు సత్యాగ్రహ పాదయాత్రలో మారెడ్డి ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ఆనాడు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా నుంచి నాందేడ్ దాకా రైతు సత్యాగ్రహ యాత్ర చేసి తాను బియ్యం మూటను భుజాన వేసుకుని మహారాష్ట్రలో అమ్మి ప్రభుత్వ నియంతృత్వాన్ని సవాలు చేయటం వల్ల ఆంక్షల సంకెళ్లు తెగి తెలంగాణలో బియ్యం బస్తా రేటు రూ.750 నుంచి 1200కి పెరిగిందని గుర్తుచేశారు. రైతులకు తక్షణ మేలు చేయడమే కాకుండా, వ్యవసాయ సంక్షోభానికి ఆచరణాత్మక కీలక పరిష్కారం చూపిన ఈ కార్యక్రమాన్ని రైతుల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీలకతీతంగా అంకితభావంతో మారెడ్డి కృషి చేశారన్నారు. ఆయన మృతి రైతులకు, సమాజానికి లోటని విచారం వ్యక్తం చేశారు. హన్మంతరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. రైతు సత్యాగ్రహ పాదయాత్రలో, సిద్దిపేట జిల్లా ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సాధన ఉద్యమంలో మారెడ్డితో కలిసి పనిచేశానని, ఆయన మృతి బాధాకరమని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమ జేఏసీలో, దీక్షా శిబిరంలో ఆయన కీలకపాత్ర పోషించారని, సమాజ శ్రేయస్సు కోసం తుదిశ్వాస వరకు పరితపించారని అన్నారు. మారెడ్డి ఆత్మకు శాంతి కలగాలని, ఆయన ఆశించిన జనతెలంగాణ సాకారం చేయటానికి లోక్‌సత్తా తన వంతు కృషిని కొనసాగిస్తుందని అన్నారు.



## కాంట్రాక్టు వ్యవసాయానికి ఆమోదముద్ర

రైతుల ఆదాయం వృద్ధి చేసే దిశగా దేశంలోనే తొలిసారిగా కాంట్రాక్టు వ్యవసాయంపై తమిళనాడు ప్రభుత్వం రూపొందించిన చట్టానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. దీంతో ఒప్పంద వ్యవసాయంపై చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తులు, పశుసంవర్ధక ఒప్పంద సేవా సదుపాయాల చట్టం పేరుతో ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టింది. పంట దిగుబడి అధికంగా ఉన్న సమయంలో, మార్కెట్ ధరల హెచ్చుతగ్గుల వేళ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అలాంటి పరిణామాలు ఎదురైనప్పుడు ముందుగా కొనుగోలుదారులతో ఒప్పందం కుదుర్చు కున్న ప్రకారం ధర చెల్లించడానికి వీలు కలుగుతుందని పేర్కొంది. ఈ ఒప్పందాలను ఉన్నతాధికారుల సమక్షంలోనే కుదుర్చుకునే విధంగా, తప్పకుండా వాటి వివరాలను నమోదు చేసుకునేలా చట్టంలో పొందుపరిచారు. కాంట్రాక్టు వ్యవసాయం చట్టం సక్రమంగా అమలయ్యేందుకు, పనితీరు మెరుగ్గా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేయడానికి ప్రభుత్వం తమిళనాడు రాష్ట్ర కాంట్రాక్ట్ ఫార్మింగ్ అండ్ సర్వీసెస్ అథారిటీ పేరుతో ఆరుగురు సభ్యుల సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది.

## పోటీతత్వంలో 10 స్థానాలు దిగజారిన భారత్

ప్రపంచంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశాల్లో తొలి వరుసలో నిలిచిన భారత్.. పోటీతత్వంలో మాత్రం వెనుకబడింది. ప్రస్తుత సంవత్సరానికి విడుదలైన దేశాల జాబితాలో భారత్ పది ర్యాంకులు పడిపోయి 68వ స్థానానికి జారుకున్నదని వార్షిక గ్లోబల్ కాంపిటీటివ్‌నెస్ ఇండెక్స్ పేరుతో వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన నివేదిక తెలిపింది. ✦ఆరోగ్యకరమైన ఆయుర్దాయం జాబితాలో భారత్‌కు 109వ స్థానం లభించింది. మొత్తంగా 141 దేశాలు ఉన్నాయి. దక్షిణాసియా దేశాల కంటే దిగువస్థానంలో ఆఫ్రికా ఉన్నది. ✦ ప్రతిభావంతులు, ప్రోత్సాహక దేశాల ర్యాంకుల్లో 118వ స్థానంలో ఉండగా, నైపుణ్యంలో 107వ స్థానం లభించింది. ✦ గడచిన ఏడాది కాలంలో కొలంబియా, దక్షిణాఫ్రికా, టర్కీ దేశాల ర్యాంకులు మెరుగుపడి భారత్‌ను దాటేశాయి. ✦కొరియా, జపాన్, ఫ్రాన్స్, చైనాల ఆర్థికస్థితిగతులు బలపడ్డాయి.

# పారిశుద్ధ్య కార్మికుల్ని సన్మానించిన లోక్‌సత్తా

జాతినిర్మాణంలో భాగంగా మహాత్మాగాంధీ పారిశుద్ధ్యానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, ప్రకాష్ హోల్లా అన్నారు. ఆరోగ్యం, విద్య, స్థానిక ప్రభుత్వాలు, అవినీతి నిర్మూలన, పారిశుద్ధ్యాలది విడదీయలేని సంబంధమన్నారు. గాంధీజీ 150వ జయంతి సందర్భంగా.. కరీంనగర్‌లోని సులభ్ కాంప్లెక్స్‌లో గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న గణేష్ ఝా, జశంతి (బీహార్), నగర పాలక సంస్థలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న మొగిలి అనూషలకు మిఠాయిలు తినిపించి శాలువాలతో లోక్‌సత్తా నేతలు సత్కరించారు. మన దేశానికి రాజకీయ స్వరాజ్యం మాత్రమే వచ్చింది తప్ప గాంధీ గారు కలలుగన్న సురాజ్యం రాలేదని, ఈ ఎజెండా దిశగా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని శ్రీనివాస్, ప్రకాష్ అన్నారు. అవినీతి నిర్మూలనకు కీలకమైన లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, సమాచార కమిషన్‌లలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లోక్‌సత్తా, వినియోగదారుల సంఘం బాధ్యులు




ఆర్. చంద్రప్రభాకర్, కె.ఎస్ నారాయణ, కె.రాంచంద్రారెడ్డి, ఒ.పి రఘురాం, టి.గంగారావు, ఎం.గంగాధర్, ఎ.ఐలయ్య, సయ్యద్ ముజఫర్, ఎ.మనోహర్, ఎస్.దామోదర్, పి.కొండలరావు, ఎస్.సురేష్, ఎస్.వేణు, మోహన్, వెంకటరెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫెడరలిజంలో స్థానిక ప్రభుత్వాలూ భాగమే.. రాష్ట్ర బడ్జెట్‌లో 25 శాతం నేరుగా కేటాయించాలి

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను పటిష్టంగా ఏర్పాటు చేయటం ఆహ్వానించదగ్గ పరిణామమని, అయితే వాటిపై పైనుంచి పెత్తనం చేయకుండా రాష్ట్ర బడ్జెట్ నుంచి కనీసం 25 శాతం నిధుల్ని స్థానిక ప్రభుత్వాలకి కేటాయించాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎలా వాటా అడుగుతోందో.. అదే ఫెడరల్ స్ఫూర్తితో స్థానిక ప్రభుత్వాలకు కూడా రాష్ట్రం వాటా ఇవ్వాలన్నారు. స్థానికంగా అవినీతి, అక్రమాలు జరిగితే చర్యలు తీసుకునేలా పర్యవేక్షణకే రాష్ట్ర యంత్రాంగం పరిమితమవ్వాలన్నారు. కడపలో మీడియాతో మాట్లాడుతూ.. రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం అనే నిర్ణయాన్ని కూడా జగన్ సర్కారు సవరించాలని బాబ్జీ అన్నారు. రెండు వేల మందికి 10 నుంచి 12 మంది ఫంక్షనల్ అసిస్టెంట్లు ఏం పనులు చేస్తారని ప్రశ్నించారు. వీరు కాకుండా వలంటీర్లను జీతాలిచ్చి ఏర్పాటు చేశారన్నారు. చిన్న పంచాయతీలను క్లస్టర్లుగా చేసి కనీసం 10,000 - 20,000 మందికి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం విజ్ఞుల, అనుభవజ్ఞుల సూచనల్ని పట్టించుకోకుండా తొందరపాటు, ఏకపక్ష ధోరణులతో వ్యవహరిస్తే చివరకు సచివాలయాలు గుదిబండగా మారే ప్రమాదముందన్నారు. క్లస్టర్ పద్ధతిలోనే గ్రామాలకు, వార్డులకు




ఎంబీబీఎస్ డాక్టర్‌ని అందుబాటులోకి తెచ్చి ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించాలన్నారు. ఇందుకు ఆరోగ్యశ్రీ సరిపోదన్నారు. ప్రతి ఇంటికీ /కుటుంబానికీ ఒక డాక్టర్ ఉండేలా ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ప్రవేశపెట్టాలన్నారు. కేవలం రూ.2,900 కోట్ల అదనపు వ్యయంతో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఒక డాక్టర్ అందుబాటులో ఉండేలా విధానాన్ని ఇప్పటికే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యమంత్రి జగన్‌కు పంపారని, దీనిపై చర్చించి వేగంగా అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లోక్‌సత్తా రాష్ట్ర నేతలు బాలసుబ్రమణ్యం, వెంకటరమణబాబు, జిల్లా నాయకులు దేవర శ్రీకృష్ణ, రెడ్డయ్య, శ్రీధర్‌రావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# మీడియాలో 'క్' కామెంట్లు!

*గాంధీ గురించి ఇప్పుడు మనం ఆలోచించటమంటే మన భవిష్యత్తు గురించి మనం ఆలోచించుకోవటమే. గాంధీ ప్రబోధించిన అహింసా సిద్ధాంతం చాలా లోతైంది. హింసతో దేన్ని సాధించినా దాన్ని హింసతోనే కాపాడుకోవాల్సి వస్తుందన్నదే ఆయన ప్రతిపాదన. హింసతో సాధించింది హింసతోనే ముగుస్తుంది. ఆయుధ బలంతో మాత్రమే సాధ్యమయ్యే విప్లవాలు నిలబడలేవని గాంధీ గట్టిగా నమ్మారు. పెద్దఎత్తున హింసను ప్రయోగించగలిగే సాధన సంపత్తి, వనరులు ఆధునిక రాజ్యాల్లో పుష్కలం. ఏ ప్రభుత్వాన్నైనా హింసతో ఎదుర్కోవటం అసాధ్యం. గాంధీ జీవితాంతం పరితపించిన విలువలను తూకపురాళ్లుగా తీసుకుని మనం ఎక్కడున్నామో అంచనా వేసుకుంటే విషాదదృశ్యమే కనపడుతుంది. పర్యావరణ విధ్వంసం, మత దురహంకారం, కులతత్వం, విజృంభిస్తున్న గాడ్సే ఆలోచనాధోరణి, విపరీత సైనిక వ్యయం, తారాస్థాయికి చేరుకుంటున్న అసమానతలు, బలహీనవర్గాలపై దాడులు, వేలకోట్లలో ఎన్నికల ఖర్చులు, విచ్చలవిడి మద్యం వాడకం చూస్తుంటే గాంధీ ప్రబోధాల నుంచి నవభారత్ చాలా దూరం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఆ దూరాన్ని తగ్గించటానికి మరో సైద్ధాంతిక ప్రత్యామ్నాయమూ కనుచూపుమేరలో లేదు. తరాలు మారినా తిరిగి తిరిగి గాంధీ లేవనెత్తిన మౌలిక నైతిక ప్రశ్నల వైపు వెళ్లటమూ తప్పటం లేదు. అందుకే గాంధీ ప్రతి ఆశయమూ వక్రీకరణకో, వికృతీకరణకో గురవుతున్న సమయంలో మనం ఏది సత్యం, ఏదసత్యం.. ఏది వెలుతురు.. ఏది చీకటి.. ఏది నీతి.. ఏది నేతి అని ఘోషిస్తూనే ఉండాలి. నైతిక పరివర్తనకు లోనవుతూనే ఉండాలి.*

- ఎన్. రాహుల్ కుమార్

**రుషులు మానవాళికి మార్గదర్శక సూత్రాల్లాంటి శాస్త్రాలను అందిస్తారు. జాతి హితం కోసం విజ్ఞానాన్ని రూపొందిస్తారు. దీనికోసం అంతులేని తపస్సు చేస్తారు. తపస్సు అంటే తపించడం. తాననుకున్న లక్ష్యం కోసం కష్టతరమైన సాధన చేసి ఓ లక్ష్యాన్ని చేరుకోవడం. అందుకే.. మనిషి రుషికి పుట్టుకతోనే రుణపడి ఉంటాడు.**

- యల్లాప్రగడ మల్లికార్జునరావు

దేశంలో నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టులన్నీ పెద్దవారి కోసమే. అందుకే పెద్ద కట్టడాలపైనే పాలకులు దృష్టి సారిస్తున్నారు. నిరుపేదలు, సామాన్యులు బతకాలన్నా, వాతావరణం బాగుండాలన్నా చిన్నచిన్న డ్యాంలు, ప్రాజెక్టులు అవసరం. మహారాష్ట్రలో ఒకటి రెండు చోట్ల నీరు నిల్వ చేయడంతో మిగిలిన ప్రాంతం ఎడారిలా మారింది. ఎగువ నుంచి దిగువకు నీరు పారేలా విధానాలు ఉండాలి. భూగర్భంలోకి నీళ్లు ఇంకేలా చర్యలు తీసుకోవాలి. మన చేతిలోనే వాతావరణ పరిస్థితులు ఆధారపడి ఉన్నాయి. ఇంజినీరింగ్‌కు శాస్త్రవేత్తల ఆలోచనలు తోడు కావాలి. మన విద్యావిధానం కూడా మారాల్సిన అవసరం ఉంది.

- రాజేంద్రసింగ్,
వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా

**తల్లిదండ్రులకు, గురువుకు, దేశానికి ప్రతి మనిషీ రుణపడి ఉంటాడు. మేధావికి మరో రుణం కూడా ఉంటుంది. తన తలను పొలంగా మార్చి, దున్ని ఎరువులు వేసి పంటలను ప్రజలకు పంచడం. ఇది తీర్చవలసిన బాకీ. తల బీడు పడిపోయేదాక, ఆ తర్వాత ప్రపంచం శాశ్వతంగా ఆ మేధావికి బాకీ పడి ఉంటుంది. దుఃఖిత మానవాళిపై అనుకంపన, విసుగు ఎరగని, విరతి లేని జ్ఞానాన్వేషణతో సామాజిక కార్యకర్తలకు బాలగోపాల్ కరదీపిక అయ్యాడు. బాలగోపాల్‌ని ప్రేమిద్దాం, కొనసాగిద్దాం.**

- అస్నాల శ్రీనివాస్,
తెలంగాణ గెజిటెడ్
అధికారుల సంఘం సభ్యులు

చైనా-అమెరికా వాణిజ్య పోరులో చైనా నుంచి దాదాపు 66 కంపెనీలు చైనా నుంచి బయటకు వెళ్లిపోతే అందులో నుంచి రెండు మాత్రమే భారతదేశానికి వచ్చాయి. 6 కంపెనీలు బంగ్లాదేశ్ వెళ్తే, అమెరికాను చికాకు పెట్టే వియత్నాంకు 26 కంపెనీలు వెళ్లాయి. అంటే, మన దేశ ఆర్థిక విధానాలపై విదేశీ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఏమేర నమ్మకం ఉన్నదో మనం అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయంలో రైతుకు తమ ఉత్పత్తికి తగిన ధర వస్తుందనే భరోసా ఇవ్వకుండా, ఉపాధి కల్పన లేకుండా, ప్రజల కొనుగోలుశక్తి పెరుగకుండా, పారిశ్రామికవేత్తలకు ఎన్ని పన్ను రాయితీలు ఇచ్చిన ఫలితం ఉండదు. విమర్శలతో, భావోద్రేకాలతో చెలగాటం ఆడినంత మాత్రాన దేశం ఆర్థిక ప్రగతి సాధించలేదనే సత్యాన్ని ప్రభుత్వ పెద్దలు గ్రహిస్తే మంచిది.

- సీహెచ్‌వీ ప్రభాకర్‌రావు

విద్యావిధానంలో మార్పుల ద్వారా మాత్రమే బాలలు యంత్రాలతో పోటీ పడగలరని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం'లో జాక్ మా (అలీబాబా సంస్థాపకుడు) ఉద్ఘాటించారు. సత్వర, పటిష్ట ఆర్థికాభివృద్ధి సాధించాలంటే విద్యాసంస్కరణలకు అధిక ప్రాధాన్యమిచ్చి తీరాలి అనేది ఆయన వక్కాణింపు అంతర్భావం.

- భరత్ ఝున్‌ఝున్‌వాలా,
ఆర్థికవేత్త

సైన్స్‌నూ పద్యంగా చదువుతూ వెళ్తున్నాం. దానిలో దాగిన శాస్త్రీయతను జీవితానికి అన్వయించుకోలేకపోతున్నారు. వైజ్ఞానిక దృక్పథంతో ఆలోచించాలి. మూఢనమ్మకాల నిర్మూలనా చట్టాన్ని తెలుగు రాష్ట్రాలు అమలు చేయాలి.

- టి. రమేష్, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ ఉపాధ్యక్షులు

అసాధారణ ప్రజాదరణ కలిగిన ప్రధాని నరేంద్రమోదీ, ఆయన ప్రభుత్వం కలిసి నియంత్రించలేని అంశమేమిటంటే మార్కెట్లే. న్యాయవ్యవస్థ, మీడియా, ఎన్నికల కమిషన్, చివరకు పాకిస్తాన్‌తో అయినా సరే.. మోదీ ప్రభుత్వం శక్తిమంతంగా వ్యవహరించగలిగింది. కానీ పశుబలం కలిగిన రాజకీయ అధికారం కూడా మార్కెట్ విషయంలో ఏమీ చేయలేదు.

- శేఖర్ గుప్తా,
ద ప్రింట్ చైర్మన్,
ఎడిటర్-ఇన్-చీఫ్

అత్యంత ధైర్యశాలురు, నిజాయితీపరులు, మేధావులైనవారితో సహా సామాజిక క్రియాశీలురు, రాజకీయ కార్యకర్తలు అత్యధికులతో ఒక సమస్య ఉన్నది. సామాన్యంగా ఒక ఆర్థిక విధానానికి, ప్రత్యేకంగా ఒక సామాజిక విధానానికి రూపకల్పన చేయడంలో వారు ప్రధానంగా అత్యంత ముఖ్య, ప్రభావశీల భావాల నుంచి స్ఫూర్తి పొందుతారు. అయితే విధానపరమైన నిర్దేశాలకు నేరుగా వెళతారు. లక్ష్యాలు, సాధనాల విషయంలో స్పష్టతతో వ్యవహరించక పోవడం కద్దు. అభిజిత్ బెనర్జీ కృషి విధాన నిర్ణేతలతోపాటు సామాజిక క్రియాశీలురు మన విధానాలకు సంబంధించిన ఒక బలహీన అంశంపై దృష్టిని కేంద్రీకరించడానికి తోడ్పడింది. విధాన రూపకల్పనే ఆ బలహీన అంశం. మహిళా రిజర్వేషన్ల బిల్లు, విద్యాహక్కు చట్టం మొదలైన వాటిని తీసుకోండి. అవి పూర్తిగా సదుద్దేశాలతో సంకల్పించినవే. అయితే వాటి నిర్మాణం సరిగా లేకపోవడం వల్లే లక్ష్యానికి పూర్తి విరుద్ధమైన ఫలితాలనిస్తున్నాయి.

- యోగేంద్ర యాదవ్,
స్వరాజ్ ఇండియా పార్టీ అధ్యక్షులు

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా)







# 'యూత్ ఫర్ బెటర్ ఇండియా'..

## వైబీఐకి కమిటీని ప్రకటించిన జేపీ.. కార్యక్రమాల్ని ముమ్మరం చేయటమే లక్ష్యం

యువతలో పరిజ్ఞానాన్ని, పరిష్కార శక్తిని పెంచుతూ పార్టీలకతీతంగా సంఘటితంగా పనిచేసే సామాజిక నాయకులుగా తయారుచేసేందుకు ఏర్పాటు చేసిన వేదిక 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' (వైబీఐ) కార్యక్రమాల్ని ముమ్మరం చేసేందుకు కమిటీని నియమిస్తున్నట్లు వైబీఐ మెంటార్ డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. వైబీఐ కార్యవర్గం వివరాల్ని మీడియాకు విడుదల చేశారు.

**వైబీఐ కో ఆర్డినేటర్లు:**
దాట్ల లక్ష్మి
ఇడుపులపాటి శ్రీనివాస్
టి.ఆర్ జగన్నాథరెడ్డి

**ఎగ్జిక్యూటివ్ కమిటీ:**
అధ్యక్షుడు: శ్రీకాంత్ రెడ్డి మారంరెడ్డి
ప్రధాన కార్యదర్శి: లోదగల మిథున్ కుమార్

**కమిటీ సభ్యులు:**
భార్గవ్, గురు మల్లి, హరీష్ చెరుకూరి, కిషోర్ సంగిశెట్టి, మనోజ్ కుమార్ చిట్టిమల్ల, నందకిషోర్, నెక్కంటి శరత్ చంద్ర, పోలి రెడ్డి గంటా, రాజేష్ రెడ్డి తమటం, రవి రాఘవేందర్, సోమనాథ్ రెడ్డి, శ్రీనివాస్ సిరపు, సూర్యనారాయణ

కమిటీని ప్రకటించిన అనంతరం వైబీఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, మిథున్ కుమార్ మాట్లాడుతూ.. ఈవేళ ప్రతి సమస్యా పెద్ద సంచలనంగా, పోరాటంగా తయారవుతోంది తప్ప పరిష్కారాలు లభించటంలేదని, సంఘటిత పోరాటంతో నిర్దిష్ట పరిష్కారాలనందించేందుకే వైబీఐని సమగ్ర వేదికగా యువతకు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. వ్యక్తిత్వాన్ని వికసింపచేసుకునేందుకు, చదువులో, వృత్తిలో, నాయకత్వంలో ఎదిగేందుకు జేపీ మెంటార్‌షిప్‌లోని వైబీఐ సరైన వేదికన్నారు. విద్యార్థులు, యువత, వివిధ సమస్యలపై అవగాహన ఉన్న నిపుణులు, భావసారూప్యత గల ఉద్యమ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఎవరైనా ఇందులో భాగస్వాములు కావచ్చని, peopleatybi@gmail.com మెయిల్ ఐడీ నుంచి గానీ, 96186 32210 వాట్సాప్ నంబర్ ద్వారాగానీ వైబీఐలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

INDIAN DEMOCRACY AT WORK

Theme 2020

# MONEY POWER IN POLITICS

09-10 January 2020

Venue : Indian School of Business, Hyderabad

https://www.indiandemocracyatwork.in/

Conference co-hosted by

ISB Bharti Institute of Public Policy

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS

University of Hyderabad

## PROMINENT SPEAKERS



**Amit Verma**
Writer, Columnist and Podcaster



**C Anjaneya Reddy**
Former DG Vigilance and Enforcement



**Anirudh Krishna**
Professor, Duke University



**Arun Shourie**
Economist, Journalist, Writer and Politician



**Ashok Lavasa**
Election Commissioner of India



**Ashutosh Varshney**
Director, Centre for Contemporary South Asia, Brown University



**N Bhaskar Rao**
Director, Centre for Media Studies



**Justice Chelameswar**
Former Judge, Supreme Court of India



**Diego Maiorano**
History Research Fellow, National University of Singapore



**Irfan Nooruddin**
Director - India Initiative and Professor, School of Foreign Service, Georgetown Unversity



**Jairam Ramesh**
Economist and Politician



**Jashwant Mehta**
Founder, Forum for Presidential Democracy



**Jayaprakash Narayan**
Founder, Foundation for Democratic Reforms



**Jennifer Bussel**
Assistant Professor, University of California



**Kumar Ketkar**
Journalist, Writer and Politician



**Mythili Bhusnurmath**
Economist and Journalist



**Neelanjan Sircar**
Senior Research Fellow, Centre for Policy Research



**K. Padmanabhaiah**
Former Home Secretary, Government of India



**Prashanth Kishor**
Political Strategist and Politician



**Justice Raghuram Goda**
Director, National Judicial Academy



**Pradeep Chhibber**
Director Institute of International Studies, University of California



**Ram Madhav**
National General Secretary, Bharatiya Janata Party



**Sitaram Yechury**
Secretary General, Communist Party of India



**Yamini Aiyar**
President and Chief Executive, Centre for Policy Research

**Registration Fee - ~~Rs. 3,500;~~ Early Bird Offer - Rs. 3,000 only!**
**Deadline for Registration - 30th Nov, 2019**

**Limited Seats only! Hurry up! Be an Early Bird. Register Now and Save!!**

**Participation Registration Form at**
https://www.indiandemocracyatwork.in/participate/

**Contact Us :**

**email** : contact@indiandemocracyatwork.in | **Twitter** - @IDWConf | **Facebook** - /IDWConf | **Instagram** - @idwconf

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th November, 2019 Posting Date 15 &16th of every month

# ఫెడరలిజం తప్ప ప్రపంచ దేశాలకు మార్గం లేదు




సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమైన నేపథ్యంలో ఈవేళ ఏ దేశం కూడా ఏకాకిగా, నా ఇష్టం వచ్చింది చేస్తాననే పరిస్థితి లేదని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని దేశాలూ సమాఖ్య భావనకు కట్టుబడి వ్యవహరించాల్సిందేనన్నారు. కృష్ణన్ శ్రీనివాసన్, జేమ్స్ మయాల్, సంజయ్ పులిపాక ఎడిట్ చేసిన 'వాల్యూస్ ఇన్ ఫారిన్ పాలసీ' పుస్తకంపై హైదరాబాద్ 'ఆస్కి' (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా)లో నిర్వహించిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. స్వదేశీ విలువలు, ప్రయోజనాలపై దేశాల మధ్య సంఘర్షణ ఉన్నా కూడా.. జాతీయ ప్రయోజనాలకు, ప్రపంచ ప్రయోజనాలకు మధ్య వైరుధ్యం లేదన్నారు. దేశ ప్రయోజనాలు నెరవేరాలంటే ప్రపంచ ప్రయోజనాలను దెబ్బతీయాలనే జీరోసమ్ ధోరణి నుంచి దేశాలు బైటపడుతున్నాయన్నారు. నాగరిక స్వప్రయోజనాలు, స్పర్ధ, ఉమ్మడి విలువలు ప్రస్తుత ప్రపంచ సంబంధాలకు చుక్కానిగా మారుతున్నాయన్నారు. సాంకేతికత, సమాచారం, వికేంద్రీకృత మార్కెటింగ్‌ల వల్ల దేశాల మధ్య లావాదేవీల్లో నియమ నిబంధనలకు, సార్వత్రిక పద్ధతులకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. ఇవన్నీ సానుకూల పరిణామాలేగానీ, మెరుగైన ప్రపంచం దిశగా ఇంకా సాధించాల్సింది చాలా ఉందన్నారు. లోతైన పరిజ్ఞానానికి, పరిశీలనకు, పాండిత్యానికి నిదర్శనంగా నిలిచే పుస్తకాన్ని వెలువరించారంటూ సంపాదయత్రయాన్ని జేపీ అభినందించారు. విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి కృష్ణన్ శ్రీనివాసన్ మాట్లాడుతూ, విలువలతో కూడిన విదేశాంగ విధానాలే దేశానికి మేలు చేస్తాయన్నారు. విదేశాంగ విధాన రూపకల్పనలో జాతి విలువలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు విధానాల రూపకల్పనలో భిన్నాభిప్రాయాలున్నాయన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త మోహన్ గురుస్వామి సమీక్ష చేస్తూ.. ప్రస్తుత పరిస్థితుల్లో జాతి స్వీయ ప్రయోజనాలే విలువలను శాసిస్తున్నాయని, విలువలను బట్టి జాతి ప్రయోజనాలు ఉండటం లేదన్నారు. జాతి ప్రయోజనాల పేరిట ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు శాంతి, విశ్వజనీనతను ఉద్బోధిస్తున్నాయని, విధానాల రూపకల్పనకు రాజ్యాంగ ప్రజాస్వామ్యం మార్గదర్శకం కావాలని ఆస్కి చైర్మన్, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య అన్నారు. కార్యక్రమంలో ఎడిటర్లతోపాటు మాజీ ఐఏఎస్ కాకి మాధవరావు, సీనియర్ ఐఏఎస్ అధికారి రామచంద్రమూర్తి, ఆస్కి డైరెక్టర్ జనరల్ శోభనా కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020